Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

దినపత్రిక

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 321 | పేజీలు 8 | వెల : 5 | మంగళవారం 22 ఏప్రిల్ 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక




వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

**ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...**

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనులు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

**తారీఫ్**

| | |
|---|---|
| | బ్లాక్ & వైట్ పేజీ |
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఫ్రంట్ పేజీ : 30,000/- |

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.




2వ

## గోదావరి పుష్కరాలకు పోలవరం సిద్ధం

ఆరు నెలల ముందే పూర్తి చేసేలా ప్రణాళిక

మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి




2వ


## 23న టెన్త్ ఫలితాల విడుదల



# మోదీ పర్యటనతో అమరావతి పనులు ఊపందుకుంటాయి: ఏపీ మంత్రులు

అమరావతి: ప్రధాని మోదీ పర్యటనతో అమరావతిలో పనులు మరింత ఊపందుకుంటాయని ఏపీ మంత్రులు తెలిపారు. ఏపీ పర్యటనలో భాగంగా మే 2న సాయంత్రం 3 గంటలకు ఆయన గన్నవరం చేరుకుంటారని చెప్పారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, నారాయణ, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని వచ్చి వెళ్లేవరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించామన్నారు. సభావేదిక వద్దకు చేరుకునేందుకు 7 రహదారులు ఉన్నాయని, అన్ని మార్గాల్లోనూ వేదిక వద్దకు చేరుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అధికారులందరికీ బాధ్యతలు అప్పగించినట్లు పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. వేదికపై మోదీ గంటపాటు ఉంటారని చెప్పారు. గత ఐదేళ్లు రాజధాని రైతులను అప్పటి ప్రభుత్వం ఇబ్బందులు పెట్టిందని, అందువల్ల రైతులను కూడా గౌరవించుకోవాలని నాదెండ్ల మనోహర్ అన్నారు. గత ప్రభుత్వం రాజకీయ కక్షతో పోలవరాన్ని, అమరావతిని నిలిపివేసిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం పనులు పునఃప్రారంభమయ్యాయని, అమరావతి పనులను కూడా తిరిగి ప్రారంభించేందుకు ప్రధాని ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. మే 2న రూ.లక్ష కోట్ల అభివృద్ధి పనులను మోదీ ప్రారంభిస్తారని అన్నారు.

> ప్రధాని మోదీ పర్యటనతో అమరావతిలో పనులు మరింత ఊపందుకుంటాయని ఏపీ మంత్రులు తెలిపారు.




## తెలుగు రాష్ట్రాల జడ్జీల బదిలీ

ఏపీ, తెలంగాణ హైకోర్టుల న్యాయమూర్తుల బదిలీ జరిగింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేందర్ మద్రాస్ హైకోర్టుకు.. జస్టిస్ పి.శ్రీసుధ కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావును కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేశారు.

# శంకర్ విలాస్ బ్రిడ్జి ఆధునీకరణ

**స్థలాలు కోల్పోతున్న వారికి పరిహారం**

**చెక్కులు అందచేసిన కేంద్రమంత్రి పెమ్మసాని**

గుంటూరు: గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోవడం తో శంకర్ విలాస్ బ్రిడ్జిని ఆధునీకరణ చేయబోతున్నామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. 1958లో కట్టిన శంకర్ విలాస్ బ్రిడ్జి శిథిలావస్థకు వచ్చిందని అన్నారు. నందివెలుగు బ్రిడ్జి అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం 2014లో మంజూరు చేసిందని గుర్తుచేశారు. సోమవారం శంకర్ విలాస్ పై వంతెన కోసం భవనాలు, స్థలాలు కోల్పోతున్న వారికి పరిహారం పంపిణీ చేశారు. గుంటూరు కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడారు. కేవలం 6 నెలల వ్యవధిలో శంకర్ విలాస్ బ్రిడ్జి అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచామని అన్నారు. బ్రిడ్జిపై కొంతమంది అపోహలు కలిగిస్తున్నారని చెప్పారు. ప్రజలు ఎవరూ అలాంటి అపోహలు నమ్మకుండా వాస్తవాలు ఆలోచించాలని అన్నారు. నష్టపోయిన యజమానులకు సాధ్యమైనంత వరకు ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుందని తెలిపారు. ముందుగా ఆర్యూబీ కట్టాలంటే మళ్లీ మొదటి నుంచి చేయాలని.. అప్పుడు ఆర్వోబి ఆగిపోతుందన్నారు. భవిష్యత్తులో ఆర్వోబీ కావాలంటే అప్పుడు ఉన్న పరిస్థితికి అనుగుణంగా నిర్మించుకోవచ్చని సూచించారు. బ్రిడ్జి పొడవు పెంచితే వ్యాపారాలు దెబ్బతింటాయని అన్నారు. కూటమి నాయకులు సొంత లాభం కోసం పని చేయడం లేదని.. ప్రజల అభివృద్ధి తమకు లక్ష్యమని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. శంకర్ విలాస్ పై వంతెన డిమాండ్ చాలా ఏళ్ల నుంచి ఉందని ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. ఎట్టకేలకు పై వంతెన నిర్మాణం సాకారం కానుందని అన్నారు. ఈ సమయంలో కొందరు అడ్డంకులు సృష్టించడం సరికాదని చెప్పారు. వ్యాపారులను రెచ్చగొట్టేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇలాంటి వారి విషయంలో ప్రజలు ఆలోచించాలని చెప్పారు. రెండేళ్ల లోపు పై వంతెన నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. ప్రజలకు ఉపయోగపడే వంతెనను అడ్డుకోవడం మంచిది కాదని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. కోర్టుకు వెళ్లిన వారు కూడా వంతెన నిర్మాణం కోసం సహకరించాలని కోరారు. లక్షల మందికి ఉపయోగపడే పని జరుగుతున్నప్పుడు వ్యాపారులు సహకరించాలని అన్నారు. పెద్ద ప్రాజెక్టు వచ్చినప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు తప్పవని అన్నారు. భవిష్యత్తులో జరిగే ప్రయోజనం దృష్ట్యా పై వంతెనకు సహకరించాలని కోరారు.



## పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

ఇటీవలే ఆస్పత్రి నుంచి విడుదల

సంతాపం తెలిపిన ప్రపంచనేతలు

ప్రధాని మోదీ, తెలుగు రాష్ట్రాల సిఎంల సంతాపం

2వ





2వ

## తెలంగాణను కాపాడుకోవడమే మన లక్ష్యం

కెసిఆర్‌కు, కార్యకర్తలకు మధ్య వారధిగా ఉంటా

ఖమ్మం నుంచి ముగ్గురు మంత్రులున్నా సున్నా

ఎమ్మెల్సీ కవిత వెల్లడి

# ప్రపంచంతో కలిసికట్టుగా అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దాం



**తెలంగాణలో పెట్టుబడులకు అవకాశాలు**


**ఒసాకాలో జరిగిన వరల్డ్ ఎక్స్ పోలో సిఎం రేవంత్**

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జపాన్ వేదికగా ప్రపంచానికి చాటి చెప్పారు. ఒసాకాలో జరిగిన వరల్డ్ ఎక్స్ పోలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం పాలుపంచుకుంది. వివిధ రంగాలకు చెందిన వ్యాపార వేత్తలు, పారిశ్రామిక వేత్తలతో విడివిడిగా సమావేశమైంది. వివిధ రంగాల్లో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వారితో చర్చించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఒసాకాలో జరుగుతున్న వరల్డ్ ఎక్స్‌పోలో దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ పాలుపంచుకోవటం గర్వంగా ఉందని అన్నారు. తెలంగాణ, జపాన్‌ల మధ్య ఉన్న చారిత్రక స్నేహాన్ని దీర్ఘకాల భాగస్వామ్యం గా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కొత్త ఆవిష్కరణలతో భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు కలిసి పనిచేద్దామనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న స్థిరమైన విధానాలు, సులభతర పారిశ్రామిక విధానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు తెలంగాణలో ఉన్నాయన్నారు. 'హైదరాబాద్‌కు రండి.. మీ ఉత్పత్తులు తయారు చేయండి.. భారత మార్కెట్‌తో పాటు ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేసేందుకు తెలంగాణను గమ్యస్థానంగా ఎంచుకోండి..' అని జపాన్ కంపెనీలను సీఎం తెలంగాణకు ఆహ్వానించారు. తెలంగాణకు జపాన్ మధ్య చక్కటి సంబంధాలున్నాయని, ఒసాకా బేలో సూర్యోదయం లాంటి కొత్త అధ్యాయం తెలంగాణలో ప్రారంభమవుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు. తెలంగాణతో పాటు- ఒసాకా, ప్రపంచంతో కలిసికట్టుగా అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఐటీ-, బయో -టె-క్నాలజీ రంగాల్లో తెలంగాణ ఇప్పటికే ప్రత్యేకమైన గుర్తింపు సాధించిందని ఐటీ-, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. వీటితో పాటు- ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్ రంగాల పరిశ్రమలకు ఉన్న అనుకూలతలను వివరించారు. హైదరాబాద్ లో 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ-'ని నిర్మిస్తున్నామని, ఎకో, ఎనర్జీ, స్మార్ట్ మొబిలిటీ, సర్క్యులర్ ఎకానమీపై ఈ సిటీ ఆధారపడుతుందన్నారు.

## చిన్న పిల్లల అక్రమ రవాణాపై సుప్రీం ఆగ్రహం

ఆచూకీ లేకుండా పోయిన పిల్లలను కనిపెట్టండి

ఢిల్లీ పోలీసులకు సుప్రీం ఆదేశాలు



2వ



2వ

## చైనా,అమెరికాల మధ్య సుంకాల వార్

భారీగా పెరిగిన బంగారం ధరలు

లక్ష మార్క్‌ను దాటిన తులం ధర

# తెలంగాణను
## కాపాడుకోవడమే మన లక్ష్యం



ఖమ్మం: తెలంగాణను కాపాడటమే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ప్రథమ కర్తవ్యమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి తెలంగాణను కాపాడే బాధ్యత బీఆర్ఎస్ పార్టీకే ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, పార్టీ కార్యకర్తలకు వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. సోమవారం జరిగిన సన్నాహక సమావేశంలో కార్యకర్తల సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని, ఏ చిన్న అవసరమున్నా తనను కార్యకర్తలు సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యకర్తలను కాపాడు కోవడాన్ని బాధ్యతగా భావిస్తానని స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో తెలంగాణను నెంబర్ వన్‌గా నిలబెట్టిన ఘనత కేసీఆర్‌ది అని ఎమ్మెల్సీ కవిత కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక్క సెకండ్ కూడా విశ్రాంతి తీసుకోకుండా కేసీఆర్ పని చేశారని తెలిపారు. సీతారామ ప్రాజెక్టును నిర్మించి 3.5 లక్షల ఎకరాలకు కేసీఆర్ నీళ్లు అందించారని పేర్కొన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామ రక్ష అని అన్నారు. తెలంగాణ ఉద్యమం పుట్టిందే ఖమ్మం జిల్లా నుంచి అని చెప్పారు. 1969లో ఖమ్మంలో మొదలైన తెలంగాణ ఉద్యమం రాష్ట్రమంతా పాకిందని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ద్రోహి అని విమర్శించారు. భద్రాచలంలో ఉప ఎన్నిక వస్తే గెలుపు బీఆర్ఎస్ పార్టీదే అని చెప్పారు. అలాంటి ద్రోహులను చాలామందిని చూశామని.. కుట్రలను చూశామన్నారు. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా మూడు పైసలు తేలేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆత్మీయ భరోసా కింద నిరుపేదలకు డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని విమర్శించారు. మన కళ్ల ముందే మన తెలంగాణ ఆగమవుతుంటే చూస్తూ ఊరుకోవద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అప్పులపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విపరీతమైన అబద్దాలు చెబుతున్నారని తెలిపారు. 2004లో చచ్చిన పీనుగులా ఉన్న కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకొని అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. 2004లోనే తెలంగాణ ఇచ్చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పదేళ్లు ప్రజలను ఏడిపించిందని అన్నారు. వందలాది మంది బిడ్డలను పొట్టనపెట్టు-కొని తెలంగాణ ఇచ్చారు తప్పా ఉట్టిగా ఇవ్వలేదని అన్నారు. లక్షా 60 వేల కోట్లకుపైగా అప్పు తెచ్చిన సర్కారును ప్రశ్నిస్తే బుకాయిస్తున్నారని తెలిపారు. తెచ్చిన రుణాన్ని ఏం చేశారని అడిగితే చెప్పబోమని అంటు-న్నారని పేర్కొన్నారు. తెచ్చిన అప్పులను ఎక్కడ ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. 40 వేల కోట్ల విలువైన భూములను 10 వేల కోట్లకు ప్రభుత్వం తాకట్టు-పెట్టిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 10 వేల కోట్లతో రైతు భరోసా, రుణమాఫీ చేశామని మంత్రులు చెబుతున్నారు కానీ ఇప్పటికీ 60 శాతం మందికి రుణ మాఫీ కాలేదు, 50 శాతం మందికి రైతు భరోసా రాలేదని పేర్కొన్నారు. మరి ఈ 10 వేల కోట్లు- ఎక్కడ పోయినట్లు- అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని సూచించారు. ప్రస్తుత పాలకులు చూడటానికి తెలంగాణ వ్యక్తుల్లా ఉంటారు... కానీ పనిచేసేది తెలంగాణకు వ్యతిరేకంగా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక కల్లిబొల్లి మాటలు చెప్పింది.. లేనిపోని హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు.

## చిన్న పిల్లల అక్రమ రవాణాపై సుప్రీం ఆగ్రహం

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఏరియాలో ఇటీవల అదృశ్యమైన ఆరుగురు పిల్లలను రక్షించాలని ఢిల్లీ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా పిల్లల అక్రమ రవాణా పై సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారుల అక్రమ రవాణాకు పాల్పడేవారిని చట్టం ముందు నిలబెట్టాలని, అలాంటి ముఠాలు ఈ సమాజానికి ఎంతో ప్రమాదకరమని హెచ్చరించింది.

నవజాత శిశువులను లక్షల రూపాయలకు అమ్ముతున్నట్లు- వచ్చిన వార్తలపై జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్ మాధవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం సుమోటోగా విచారణ చేపట్టింది. 'ఆ ఆరుగురు చిన్నారుల ఆచూకీని గుర్తించండి. పిల్లలను అమ్ముతున్న, కొంటున్న వారిని చట్టం ముందు నిలబెట్టండి. వారందరూ నిందితులే. వారంతా సమాజానికి పెద్ద ముప్పుగా పరిణమించారు' అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. పిల్లల అక్రమంగా రవాణా చేసేవాళ్లు హంతకులకంటే ప్రమాదకరమని జస్టిస్ పార్థివాలా అన్నారు. 'ఎవరైనా ఒక వ్యక్తిని హత్య చేస్తే దాని వెనుక పలు కారణాలు, ఉద్దేశాలు ఉంటాయి. ఆ తర్వాత అతడు మరో హత్య చేయకపోవచ్చు. కానీ పిల్లలను కిడ్నాప్ చేసి అమ్మేవారు ఆ నేరాలకు మళ్లీమళ్లీ పాల్పడుతున్నారు. వారు ఈ సమాజానికి హంతకుల కంటే ప్రమాదకరమైనవారు' అని సుప్రీంకోర్టు ఆందోళన వెలిబుచ్చింది. ఢిల్లీలో పిల్లల అక్రమ రవాణా రాకెట్ వెనుకున్న కీలక సూత్రధారిని వెంటనే పట్టు-కోవాలని పోలీసులను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో చిన్నారులను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయిస్తున్నారని, దీని వెనుక ఒక పెద్ద ముఠా పనిచేస్తున్నట్లు-వార్తలు వస్తున్నాయని పేర్కొంది. ఈ సందర్భంగా పోలీసులు.. కొందరు పిల్లలను ఎవరూ కిడ్నాప్ చేయడం లేదని, తల్లిదండ్రులే విక్రయిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దాంతో పిల్లలు దొరికినా ఎవరైనా తల్లిదండ్రులు వారిని తిరిగి తీసుకోవడానికి తల్లిదండ్రులు సిద్ధంగా లేకపోతే.. ప్రభుత్వమే వారి బాధ్యత తీసుకోవాలని కోర్టు సూచించింది. ప్రతి ఏడాది దాదాపుగా రెండు వేల మంది పిల్లల అక్రమ రవాణా కేసులు వెలుగులోకి వస్తున్నాయని జాతీయ -క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

## 23న టెన్త్ ఫలితాల విడుదల

**విజయవాడ:** పదవ తరగతి పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఏప్రిల్ 23వ తేదీన ఈ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. అధికారిక వెబ్ సైట్, వాట్సాప్, లీప్ యాప్‌లలో ఫలితాలు చూసుకోవచ్చని వివరించారు. మార్చి 2025, ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలు, ఓపెన్ స్కూల్ పదో తరగతితోపాటు- ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల చేస్తామని చెప్పారు. ఆ రోజు ఉదయం 10.00 గంటలకు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఫలితాలను అధికారిక మొబైల్ యాప్‌లలో అందుబాటు-లో ఉంటాయని పేర్కొన్నారు.

# చైనా,అమెరికాల మధ్య సుంకాల వార్

న్యూఢిల్లీ: బంగారం కొనుగోలు సామాన్యులకు మరింత కష్టతరంగా మారనుంది. మార్కెట్ వర్గాల అంచనాల మేరకు రోజురోజుకి బంగారం ధరలు అకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా బంగారం ధరకి మరోసారి రెక్కలు వచ్చాయి. 10 గ్రాముల బంగారం ధర పన్నులతో కలిసి అక్షరాల లక్ష రూపాయిలను తాకింది. సోమవారం ఒక్కరోజే బంగారం రూ.2,350 పెరిగింది. దేశంలో పసిడి ధర ఈ స్థాయిని తాకడం ఇదే తొలిసారి. అమెరికా-చైనా సుంకాల యుద్ధం వల్ల బంగారం ధరలు పెరిగిపోయాయి. దీంతో డాలర్ బలహీనపడి.. మదుపర్లు బంగారంపై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం సోమవారం 3,405 డాలర్లకు చేరింది. దీన్ని అనుసరించి సోమవారం సాయంత్రం 5.30 గంటలకు 24 క్యారెట్ల బంగారం రూ.1,00,016కు చేరింది. ఈ ఏడాదిలో బంగారం దాదాపు రూ.20వేలకు పైగా పెరగడం గమనార్హం. ఈ క్రమంలో బంగారం సరికొత్త రికార్డును నమోదు చేసింది. 10 గ్రాముల మేలిమి పసిడి ధర అక్షరాలా లక్ష రూపాయలకు చేరింది. దేశీయంగా లక్ష రూపాయల మార్కును అందుకుంది. సాయంత్రం 5.30 గంటల సమయానికి 24



క్యారెట్ల పసిడి రూ.1,00,016కు చేరింది. ఆపై కాస్త దిగి వచ్చి రూ.99,900 వద్ద ట్రేడవుతోంది. శుక్రవారం ముగింపుతో పోలిస్తే దాదాపు రూ.2 వేలు పెరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకు బంగారం ధర దాదాపు రూ.20 వేలకు పైనే పెరగడం గమనార్హం. డిసెంబర్ 31న సుమారు రూ.79 వేలు ఉన్న పసిడి ధర.. గడిచిన మూడున్నర నెలల్లో 26 శాతం మేర పెరిగింది. అటు వెండి ధర సైతం కిలో మళ్లీ రూ.లక్షకు చేరువవుతోంది. గతంలో ఓసారి లక్ష మార్కును దాటిన వెండి.. ప్రస్తుతం రూ.99,299 పలుకుతోంది. అటు- మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి తొలిసారి రూ.96 వేల మార్కు దాటింది. జూన్ నెల డెలివరీ కాంట్రాక్ట్స్‌లో 10 గ్రాముల పసిడి ఒక్క రోజులోనే రూ.1621 మేర పెరిగి ఇంట్రాడేలో రూ.96,875 వద్ద గరిష్ఠాన్ని తాకింది. రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన అమెరికా- చైనాల మధ్య వాణిజ్యం విషయంలో సయోధ్య కుదిరేంతవరకు ఇదే పరిస్థితి కొనసాగొచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# మద్దతు ధరలు..ధాన్యం సేకరణ..ఓ మిథ్య !

ఏటా ధాన్యం సేకరన ఓ ప్రహసనంగా మారింది. ధాన్యం పండిస్తున్న అన్నదాతలను అభినందించి, ధాన్యం సేకరించాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిసతున్నాయి. ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామని ప్రభుత్వాలు చెప్పడం. క్షేత్రస్థాయిలో అలాంటి ఏర్పాట్లు పెద్దగా లేకపోవడం గమనించవచ్చు.
నేటికీ సమగ్ర వ్యవసాయ విధానంపై కేం÷-దరం కూడా ఆలోచన చేయడం లేదు. దీనిపై సమగ్రంగా చర్చించాలన్న ధోరణి కానరావడం లేదు. దేశంలోని అన్నదాతలను ఆదుకోవడంతో పాటు.. దేశానికి అన్నం పెట్టాలన్న దూరదృష్టి నేతల్లో కొరవడింది. ఏం చేస్తే దేశంలో ప్రజలందరికి ఆహార ధాన్యాలు దక్కగలవో చర్చించడం లేదు. పంటలు పండుతున్నా అందరికీ ఆహారాధాన్యాలు నేటికీ అందుబాటులోకి రావడం లేదు. సాగుచట్టాలను రద్దు చేసిన తరవాత కూడా ప్రధాని మోడీ ఈ సమస్యల పై చర్చించడం లేదు. అన్నదాతల ఆదాయం రెట్టింపు చేస్తానన్న హామీలు మాటలకే పరిమితం అయ్యాయి. సన్నకారు రైతులకు అండగా ఉన్నానని,ఏటా 6వేల కోట్లు వారి ఖాతాల్లో వేస్తున్నానని ప్రధాని మోడీ గొప్పగా ప్రకటించు కోవడం తప్ప సమగ్ర వ్యవసాయ విధానానికి శ్రీకారం చుట్టడం లేదు. నిజానికి ఖాతాల్లో డబ్బులు వేయడం కాకుండా వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలో ఆలోచించడం లేదు. గ్రామాలను ఆధారం చేసుకుని వ్యవసాయాన్ని పాడి పరిశ్రమను, కోళ్ల పరిశ్రమను ఉమ్మడిగా అభివృద్ది చేయాలి. దీంతో గ్రామీణ వృత్తులకు కూడా ఆసరా దక్కుతుంది. కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. అకాల వర్షాల కారణంగా భారీగా పంటలు దెబ్బతింటున్న సందర్భంలో వారికి సకాలంలో పరిహారం అందడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 33 శాతానికంటే ఎక్కువ మొత్తంలో పంటలు దెబ్బతింటేనే నష్టపరిహారానికి సిఫార్సు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతున్న నష్టం లెక్కల్లోకి రావడం లేదు. పంటనష్టం అంతకు మించి ఉంటేనే వ్యవసాయాధి కారులు వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. గత కొన్నేళ్లుగా బీమా చేస్తున్న రైతులకు పరిహారం అందేది నామమాత్రంగానే ఉంటుంది. వేల సంఖ్యలో రైతుల పంట నష్టం జరిగినా, రైతులకు అందుతు న్నది మాత్రం తక్కువగానే ఉంటుంది. వర్షాలు కురియడం,పంటను నష్ట పోవడం కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నా అందడం లేదు. బీమా నిబంధనల ప్రకారం నష్టం 33 శాతం దాటితేనే పరిహారం వచ్చే అవకాశం ఉంది. ఈ నిబంధనలను మార్చాల్సి ఉంది. ఇన్సూరెన్స్ ఉన్న రైతులందరికి పరిహారం దక్కడం లేదు. భారీ వర్షాలతో నష్టపోతే రుణాలు తీసుకున్నవారికి ఈ బీమాను అమలు చేయక పోవడంతో రైతులపై అదను భారం పడుతోంది. నిబంధనల ప్రకారం ఐదేళ్ల ఉత్పత్తి ఆధారంగా ఎంత పంటనష్టం జరిగితే అంతే మొత్తాన్ని అందించనున్నారు. అకాల వర్షాలు భారీగా పంట నష్టాన్ని కలిగించి, రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చేతికి వచ్చిన పంటను కాపాడు కునేందుకు రైతులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఈ సమస్యలను అన్నీ చర్చించాలి. తెలుగు రాష్ట్రాల్లో పంట ఏదైనా అమ్ముకోవడం ఓ పెద్ద ప్రహసనంగా మారింది. ధాన్యం మార్కెట్లోకి తెచ్చిన తరవాత సవాలక్ష కొర్రీలు పెట్టి రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. చట్టసభల్లోనూ, బయటా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలనుకనీసంగా చర్చించడం లేదు. ప్రపంచానికి అన్నం పెట్టే స్థితిలో భారతదేశం ఉన్నా..వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మాత్రం పాలకులు ముందుకు రావడం లేదు. పక్కా మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం, భారీగా పండుతున్న పంటలను కొనుగోలు చేసే వ్యూహం ప్రదర్శించడం లేదు. పంటల కొనుగోలు సమయంలో సరైన వ్యూహంతో ప్రభుత్వాలు చర్య తీసుకుంటే ఇబ్బందులు రావు. కలెక్టర్లతో ఇటీవల తెలంగాన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించి పంటల కొనుగోళ్లకు పక్కాగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎపిలో మంత్రి అచ్చన్నాయుడు కూడా పంటల కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామన్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్...నీటి సరఫరా, రైతుబందు కింద పెట్టుబడి సాయం...రైతు చనిపోతే కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతుబీమా పథకం అమలవుతున్నాయి. ఇన్ని పథకాలు ప్రవేశ పెట్టి పంటలు కొనుగోలు చేయకపోతే ఎలా? పంటలు అమ్ముకోవడానికి రైతులు రోడ్డెక్కితే రాజకీయం ఎలా అవుతుంది.? గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, పంటలు కొనుగోలు చేయాలని కోరుకోవడం ఏటా ఓ ప్రహసనంగా మారింది. ఇది ఒక్క తెలంగాణ సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. సీజన్ లో సకాలంలో పంటలు కొనుగోలు చేసి డబ్బులు ముట్టచెప్పితే చాలు.. రైతు సమస్యలు సగం తీరినట్లే. కానీ మార్కెట్ యార్డుల్లో పడిగాపులే రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. దానికితోడు గిట్టుబాటు ధరలు రావు. అన్నీవున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా కొనుగోళ్ల విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రం పెద్దగా కార్యాచరణ చేపట్టడంలేదు. పంట ఏదైనా డిమాండ్ ఉండదు. అమ్ము కోవడానికి అష్టకష్టాలు పడాల్సిందే. ఇకపోతే దేశంలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ప్రచారం కానరావడం లేదు. కొంతమంది రైతులు ఎరువులు ఎక్కువ వేస్తే దిగుబడి పెరుగుతుందని అనుకోవడం వల్ల మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో భూసారం దెబ్బతింటోంది. అలాగే ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. ఏటా దేశంలో రైతులు పంటలు పండించి గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ఇతరత్రా తాయిలాలు ప్రకటిస్తూ ప్రభుత్వాలు రైతన్నలను మోసం చేస్తున్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని..మార్కెట్‌కు తీసుకుని వచ్చిన పంటలను సకాలంలో కొనుగోలు చేయాలన్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. ప్రధానంగా వరి,కంది, మిర్చి, పత్తి, ఎర్రజొన్న, పసుపు రైతులు బాధలు వర్ణనాతీతం. ఆర్థికంగా తాయిలాలు ఇవ్వడం కాకుండా సమస్యలను చర్చించి విధానాలు రూపొందించాలి. కెసిఆర్ ప్రవేశ పెట్టిన రైతుబంధును ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వం..పంటల కొనుగోళ్లకు సంబంధించి నిర్దిష్ట విధానాలు అమలు చేయడం లేదు. మార్క్‌ఫెడ్, సిసిఐలు రంగంలోకి దిగినా ఫలితం దక్కడంలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ-నామ్ అంటూ అట్టహాసంగా ప్రకటనలు చేసినా రైతులకు మేలు చేకూర్చలేదు. పంటలను గిట్టుబాటుధరకు రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏటా రైతులు రోడ్డెక్కడం.. దాన్ని ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం మామూలు విషయంగా మారింది.గిట్టుబాటు ధరలతో పాటు కొనుగోళ్ల కోసం పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరువవడంతో రైతులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పంటలు మార్కెట్‌కు వచ్చే సమయంలో పక్కాగా కొనుగోళ్లు సాగాలి. గిట్టుబాటు ధరలు దక్కాలి. దళారుల మోసాలు అరికట్టాలి. అప్పుడే కొంతయినా ఊరట దక్కగలదు.

# దాస్యభక్తికి నిలువెత్తు నిదర్శనం!

తిరుమల:భక్తితత్పరులు అయినవారు నవవిధ భక్తిమార్గాల ద్వారా దైవాన్ని చేరుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఈ భక్తి విధానాల్లో దాస్యభక్తికి నిలువెత్తు నిదర్శనం హనుమంతుడు. అనంత శక్తులు తనలో దాగి ఉన్నా.. రామబంటుగా ఒదిగి ఉండటమే దాసాంజనేయుడికి ఇష్టం. ఆ పరమభక్తుడు పిల్లల దేవుడు, పెద్దల దేవుడు, అందరి దేవుడు. నమ్మిన దైవంపై పరిపూర్ణమైన అంకితభావం కలిగి ఉండాలి. నిరంతరం స్వామి సేవలో తరిస్తూ ఇది తప్ప మరేదీ తనకు అవసరం లేదని ఆంజనేయుడు ప్రార్థించేవాడు. భవబంధచ్ఛిదే తస్యై స్పృహయామి న ముక్తయే భవాన్ ప్రభురహం దాస ఇతి యత విలుప్యతే'ఓ ప్రభూ! ఈ భవబంధాల నుంచి నన్ను విముక్తుడిని చేయదలిచితే చేయి. మోక్షాన్ని ప్రసాదించాలనుకుంటే, ప్రసాదించు. కానీ, నేను మాత్రం ఇవేవీ కోరుకోను. మీపై నా దాస్య భావనను మరిపించేదేదీ నాకు అవసరం లేదు' అని వినయంగా వేడుకుంటాడు హనుమ.పురాణాలను అనుసరించి హనుమ చిరంజీవి. నిరంతరం రామనామాన్ని జపిస్తుంటాడు. అంతేకాదు, ఎక్కడైనా రామనామం



వినిపిస్తే చాలు.. అక్కడికి వెళ్లిపోతాడు. ఆనందబాష్పాలు నిండిన కండ్లతో, చేతులు జోడించి అక్కడే ఉంటాడు. రామకథా గానం చేస్తున్న భక్తుల సేవా సంకల్పాన్ని పవనసుతుడు మరింత బలపరుస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి.సురోవసురో వాప్యథ వానరో నరఃసర్వాత్మనా యః సుకృతజ్ఞముత్తమమ్‌భజేత రామం మనుజాకృతిం హరిం య ఉత్తరాన నయత్కోసలాన్దివమితి (భాగవతం)'సురులు గానీ, అసురులు గానీ, నరులు గానీ, వానరులు గానీ, మానవమాత్రునిగా ఈ లోకంలో అవతరించిన దేవాదిదేవుడైన ఆ శ్రీరామచంద్ర ప్రభువును ఆరాధించాలి. భక్తుడు ఆచరించే తృణమాత్రపు సేవనైనా ప్రేమతో స్వీకరించే ఆ స్వామిని సేవించడానికి కఠోర తపస్సులు ఆచరించ అవసరం లేదు. భగవంతుడు ప్రీతి చెందితే, తన భక్తుడికి సార్థకత చేకూరినట్టే. రామచంద్రుడు అయోధ్య వాసులందరికీ తన స్వధామాన్ని (వైకుంఠాన్ని) అనుగ్రహించాడు' అని పలికిన హనుమంతుడి మాటలు రామభక్తులకు కొండంత బలాన్నిస్తాయి.

## పోప్ ఫ్రాన్సిస్ కన్నుమూత

న్యూఢిల్లీ: వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్ సోమవారం ఉదయం మృతి చెందారు.కేథలిక్‌ల అత్యున్నత మత గురువు పోప్ ఫ్రాన్సిస్ (88) ఇటలీ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 7.35కు కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా శ్వాసకోశ సమస్యలు, డబుల్ న్యూమోనియా, కిడ్నీ సమస్యలతో తీవ్రంగా బాధపడ్డారు. ఫిబ్రవరి 14 నుంచి ఆయన 38 రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం గత నెల డిశ్చార్జి అయ్యారు. ఆయన మృతి విషయాన్ని వాటికన్ వర్గాలు ధ్రువీకరించాయి. 2013లో పోప్ బెనిడెక్ట్ తర్వాత ఫ్రాన్సిస్ ఈ బాధ్యతలు చేపట్టారు. ఫ్రాన్సిస్ 1938లో అర్జెంటీనాలో జన్మించారు. దక్షిణ అమెరికా నుంచి ఈ పదవిని అందుకొన్న తొలి వ్యక్తి ఆయనే. తరచూ సామాజిక అంశాలపై కూడా పోపం వ్యాఖ్యలు చేస్తుంటారు. 2016లో రోమ్ బయట ఇతర మతానికి చెందిన శరణార్థుల పాదాలు కడిగారు. దీనిని ఆయన వినయం, సేవాతత్పరతకు చిహ్నంగా భావిస్తారు. పోప్ ఫ్రాన్సిస్ తన మరణానికి కొన్ని గంటల ముందు కూడా ఈస్టర్ పర్వదినాన భక్తులకు సందేశం ఇచ్చారు. వాటికన్ నగరంలోని పీటర్స్ స్క్వేర్‌లో దాదాపు 35,000 మందిని ఉద్దేశించి ఆయన ప్రపంచం కోసం సందేశం ఇచ్చారు. 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్, హ్యాపీ ఈస్టర్..!' అని పోప్ స్వయంగా చెప్పారు. అనంతరం ఆయన సందేశాన్ని ఆర్చి బిషప్ డియాగో రావెలి చదివి వినిపించారు. సంక్షోభాలతో రగులుతున్న గాజా, ఉక్రెయిన్, కాంగో, మయన్మార్‌లలో శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భార్య ఉషతో కలిసి ఈస్టర్ సందర్భంగా పోప్‌ను కలిశారు. ఈ సందర్భంగా పోప్ మూడు పెద్ద చాకొలెట్ ఈస్టర్ ఎగ్స్‌ను వాన్స్ దంపతులకు బహూకరించారు. ఆయన అనారోగ్యం పాలైన తర్వాత అంతమంది జనాల్లోకి రావడం ఇదే తొలిసారి. ప్రత్యేక వాహనంలో ప్రజల మధ్య నుంచి ఆయన ప్రయాణించడం విశేషం. మధ్యలో ఆగి పసికందులను, చిన్నారులను ఆశీర్వదించారు. ఆదివారం జరిగిన ఈస్టర్ వేడుకల్లో సైతం ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు వాటికన్ సిటీ- వర్గాలు వెల్లడించాయి. పోప్ ఫ్రాన్సిస్ తన 12 ఏళ్ల వయస్సు నుంచే చర్చి, సమాజం, అట్టడుగు వర్గాల కోసం అంకితభావంతో పని చేశారు. 1936,డిసెంబర్ 17వ తేదీన అర్జెంటీనాలో పోప్ ఫ్రాన్సిస్ జన్మించారు. 2013 మార్చి 13న 266వ పోప్‌గా ఫ్రాన్సిస్ ఎంపికయ్యారు. ఆయన మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోప్ ఫ్రాన్సిస్ మృతికి ఆయన సంతాపాన్ని తెలిపారు. ఆయన మరణం తనను తీవ్రంగా కలత పెట్టిందన్నారు. భారత ప్రజలపై పోప్ ఫ్రాన్సిస్ ప్రేమాభిమానాలు నిత్యం నిలిచి ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. కాథలిక్ సమాజానికి ఈ సందర్భంగా ఆయన తన సంతాపాన్ని తెలిపారు. అలాగే
చిన్ననాటి నుంచి క్రీస్తు ఆదర్శాలను పోప్ ఫ్రాన్సిస్.. తనను తాను అంకితం చేసుకున్నారని వివరించారు. పేదలు, అణగారిన ప్రజలకు ఆయన సేవలందించారని గుర్తు చేశారు. దేవుని ఆలింగనంలో ఆయన ఆత్మకు శాశ్వత శాంతి లభిస్తుందని ఈ సందర్భంగా ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా 1.4 బిలియన్ల మంది కాథలిక్కులు.. పోప్ ఫ్రాన్సిస్‌ను ఆరాధిస్తున్న సంగతి తెలిసిందే. గతేడాది ఇటలీలో జీ7 శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సమావేశం వేదికగా పోప్‌ను ప్రధాని మోదీ కలిసి సంగతి తెలిసిందే. అలాగే పోప్ ఫ్రాన్సిస్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు.
పోప్ మరణ వార్త ఇప్పుడే తెలిసింది. నేను ఆయన్ను నిన్నే కలిశాను. కొవిడ్ తొలినాళ్లలో ఆయన ప్రసంగాలను నేను మర్చిపోలేను. అవి చాలా అద్భుతమైనవని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మరణానికి ప్రపంచం సంతాపం తెలియజేస్తోంది. విధివంచితుల విషయంలో ఆయన ప్రేమ, మానవత్వం కేథలిక్ ప్రపంచానికి వెలుపల కూడా కొన్ని లక్షల మందిని ప్రభావితం చేసిందని ఐరోపా సమాఖ్య అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయెన్ అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచానికి తీరని లోటు-. ఆయన కరుణ, ప్రేమకు ప్రతిరూపం. సత్యం కోసం ఎప్పుడూ నిలబడ్డారు. అన్యాయాలపై నిర్భయంగా మాట్లాడారు. పేదలు, అణగారిన వర్గాలపై చాలా శ్రద్ధ చూపించారు. మరింత శాంతియుత, దయామయ ప్రపంచాన్ని కోరుకొనే లక్షల మందికి ఆయనో స్ఫూర్తిదాత అని ప్రియాంకా గాంధీ వాద్రా అన్నారు. పోప్ ఫ్రాన్సిస్ మృతి మానవాళికి తీరని లోటు-. ఆయన మహోన్నత ఆధ్యాత్మిక వ్యక్తి. తన జీవితాన్ని చర్చి, మానవాళి సేవకు అంకితం చేశారు. సామాజిక న్యాయం కోసం అవిశ్రాంత కృషి చేశారు. ప్రపంచ శాంతి స్థాపకుడిగా పోప్ ఫ్రాన్సిస్ పాత్ర అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి
తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ మృతి నన్ను ఎంతో బాధించింది. ఆధ్యాత్మిక నాయకుడిగా కోట్ల మందిలో స్ఫూర్తి నింపారు. శాంతి సందేశంగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున ప్రపంచ క్యాథలిక్ కమ్యూనిటీకి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## గోదావరి పుష్కరాలకు పోలవరం సిద్ధం

రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పోలవరం డెడ్‌లైన్ మారిపోయింది.. మరో ఆరు నెలల ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది.. గోదావరి పుష్కరాల నేపథ్యంలో 2027 జూన్ నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని అనుకుంటు-న్నామని ఏపీ ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. అయితే, 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా ప్రకటించారని అన్నారు. రాజమండ్రిలో మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ నిన్నటికి 202 మీటర్లు పూర్తి అయ్యిందని ప్రకటించారు. 2025 డిసెంబర్ నాటికి డయాఫ్రం వాల్ పూర్తి చేస్తామని అన్నారు. 990 కోట్ల రూపాయలతో డయాఫ్రం వాల్ నిర్మాణం జరుగుతుందని తెలియజేశారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యంగా ప్రకటించారు.. కానీ, గోదావరి పుష్కరాల నేపథ్యంలో 2027 జూన్ నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని అనుకుంటు-న్నాం అని వెల్లడించారు నిమ్మల రామానాయుడు.. ఇక, డయాఫ్రమ్ వాల్ పై అవగాహన లేకుండా వైసీపీలో ఇరిగేషన్ మంత్రులు మాట్లాడారు.. ముఖ్యమంత్రిగా జగన్ ఏనాడు పోలవరం ప్రాజెక్టుపై ధ్యస పెట్టలేదని విమర్శించారు. 1200 కోట్లతో పోలవరం ఎడమ కాలువ పూర్తి చేస్తున్నాం.. ఈ వేసవిలో కాల్వల మరమ్మతుల కోసం 366 కోట్ల రూపాయలు కేటాయించామని ఏపీ ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు .. సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా, ఈ ఏడాది డిసెంబర్ చివరినాటికి డయాఫ్రమ్ వాల్ పూర్తి చేస్తామన్నారు. రాజమహేంద్రవరంలో మంత్రి నిమ్మల మీడియాతో మాట్లాడారు.
జగన్ ఇరిగేషన్ శాఖలోనే రూ.18వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని, గత ప్రభుత్వం లష్కర్లకు ఏడాది జీతాలు బకాయిలు పెడితే.. కూటమి ప్రభుత్వం చెల్లించిందని చెప్పారు. అసలు ప్రాజెక్టులో డయాఫ్రమ్ వాల్ ఉందో లేదో కూడా వైకాపా నేతలకు తెలియదు. దానిపై వారికి అవగాహన కూడా లేదు. గతంలో చంద్రబాబు రూ.430 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తే జగన్ విధ్వంసం చేశాడు. రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రమ్ వాల్ పనులు మొదలుపెట్టాం. రెండు కట్టర్లు, రెండు గ్రాబర్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగు తున్నాయి. ఏప్రిల్ 20 నాటికి 202 మీటర్లకుపైగా వాల్ నిర్మాణ పనులు పూర్తి చేశాం. ఏప్రిల్ 30 కల్లా మూడో కట్టర్ అందుబాటు-లోకి వస్తుంది. వర్షాకాలంలో సైతం పనులు జరిగేలా, ఎగువ కాఫర్ డ్యామ్‌ను బలోపేతం చేయడానికి బట్రస్ డ్యామ్ మే నెలకల్లా పూర్తి చేస్తాం. డయాఫ్రమ్ వాల్ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా.. సమాంతరంగా గ్యాప్-1 వద్ద ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణాన్ని ఏప్రిల్‌లో మొదలుపెట్టాం.

ఉత్తేజిత దినపత్రిక



# ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సహాయ ఉపకరణాలను తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు తో కలిసి పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్.

**భవిత పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రత్యేక వసతి సౌకర్యాలు, ఉపకరణాలు.**

**ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది: జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్.**

**ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది : తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు.**



**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,ఏప్రిల్ 21**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఎన్నో ప్రోత్సాహాలు ఇస్తుందని, ఈ అవకాశాన్ని సంబంధిత తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని పిల్లల భవిష్యత్తుకు అండగా ఉండాలని తెలిపారు.సోమవారం ఉదయం స్థానిక బైరాగిపట్టెడ నందు ఎంజీఎం హైస్కూల్ నందు విద్యాశాఖ మరియు సర్వ శిక్షా అభియాన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సహాయ ఉపకరణాలను పంపిణీ కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్ కుమార్ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సుమారు 3600 మంది ఉన్నారని, వారి భవిష్యత్తు కోసం కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. ప్రతి మండలంలో ఒక భవిత పాఠశాలు కలవని, మొత్తం 34 భవిత పాఠశాలలో ఉన్నాయని అన్నారు. ఈ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు సాధారణ విద్యార్థులు లాగా విద్యను అభ్యసించే అవకాశం ఉండదు కనుక అలాంటి విద్యార్థుల కోసం భవిత పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. భవిత పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ఉపకరణాలు , పరికరాలు తో పాటు టీచర్లను నియమించడం జరిగిందని తెలిపారు. ఈరోజు 421 మందికి ట్రై సైకిల్స్ , హీరింగ్ కిట్స్ విల్ చైర్స్ , రోలేటర్స్, బ్రెయిలీ కిట్స్ వంటి పరికరాలను అందించడం జరిగిందనీ, మిగిలిన ఉపకరణాలు కూడా త్వరలో అందిస్తామని తెలిపారు. గతంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు రవాణా ఖర్చులకోసం నెలకు రూ.3000 ఉండేదని ప్రస్తుతం రూ .6000 విద్యార్థులకు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. సొంతంగా పాఠశాలలకు వెళ్ళలేని పిల్లల కోసం ఎస్కార్ట్ ద్వారా వెళ్లే పిల్లలకు కూడా నెలకు రూ.6000 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆడపిల్లల కోసం నెలకు ఇచ్చే రూ. 6000 రూపాయలు కాకుండా ప్రత్యేక స్టైఫండ్ అలవెన్స్ కింద అదనంగా రూ. 2000 రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. భవిత పాఠశాలలకు వెళ్ళలేని పరిస్థితిలో ఉన్న పిల్లల కూడా ఇంటి దగ్గరే పాటలు చెప్పడం జరుగుతుందని వారికి కూడా నెలకి రూ. 3000 ఇస్తున్నారని అన్నారు. మిగతా పిల్లలు లాగే ప్రత్యేక అవసరాలు గల పిల్లలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు వెళ్ళగలరని తల్లిదండ్రులు వారి పిల్లలకి అండగా ఉండి వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రోత్సహించాలని అన్నారు. ఇలాంటి పిల్లల కోసం తల్లిదండ్రులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ%శీ% కూడా అండగా ఉంటుందన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వివిధ కేటగిరీ కింద పెన్షన్లు అందిస్తున్నామని, అలాగే పరికరాల కూడా అందించడం వలన సమాజంలో మిగతా పిల్లలు లాగా గుర్తింపబడతారని తెలిపారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (%ALIMCO%), జిల్లా సమగ్ర శిక్ష సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో ఈ రోజు 421 మందికి ట్రై సైకిల్స్, మోటార్ సైకిల్, హియరింగ్ కిట్స్, బ్రెయిలీ కిట్స్ తదితర ఉపకరణాలను ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అందజేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యాశాఖ అభివృద్ధి కోసం ముందు చూపుతో విద్యాశాఖ లో పెనుమార్పులు తీసుకొని వచ్చి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు పాఠశాలకు వెళ్ళి విద్యను అభ్యసించలేని వారి కోసం ఇంటి దగ్గర నుంచి పాఠాలు నేర్పించి వారి తల్లిదండ్రుల సహాయంతో వారి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఈ కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే తో కలిసి జిల్లా కలెక్టర్ విద్యార్థులకు వివిధ రకాల ఉపకరణాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల తల్లిదండ్రులు ఉపకరణాలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ విద్యాశాఖ అధికారి బాలాజీ, ఇంక్లూజివ్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం ముని శారద, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ పేరుతో జగన్ యువతకు మోసం చేశారు

**సీఎం చంద్రబాబు గారు, మంత్రి నారా లోకేష్ గారి చిత్రపటాలకు పాలభిషేకం**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు ఏప్రిల్ 21 సోమవారం పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే డివిజన్ రెడ్డి స్వగృహంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం - బిలివైసీపీ హయాంలో మెగా డీఎస్సీ పేరిట నిరుద్యోగ యువతను మాజీ సీఎం జగన్ మోసం చేశారని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు డీఎస్సీ నోటిఫికేషన్ పై తొలి సంతకం చేసి నిరుద్యోగులకు న్యాయం చేశారన్నారు. సోమవారం స్థానిక కుర్ణి కల్యాణ మండపంలో డీఎస్సీ అభ్యర్థులతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం 6 వేలు డీఎస్సీ ఇస్తానని నమ్మించి మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ఇచ్చిన మాట ప్రకారం 16 వేల డీఎస్సీ పోస్టులను విడుదల చేశామన్నారు. ఇందుకు ఎమ్మిగనూరు ప్రజల తరుపున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 నెలలలోనే ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేసి పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. పాస్టర్లకు ఐదు వేలు, అర్చిలకు 10 వేలు జీతం పెంచడం జరిగిందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని దాన్ని సరిదిద్దుతూ సంక్షేమం అభివృద్ధిని కొనసాగిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో డీఎస్సీ పోస్టు అత్యధిక రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు టిడిపి నాయకులు పార్టీ కౌన్సిలర్లు తదితరులు డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

# మే 1 నుండి 10వ తేదీ వరకు నారాయణవనం శ్రీ అగస్తీశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 21**

నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మే 1 నుండి 10వ తేదీ వరకు ఘనంగా జరుగనున్నాయి. ఏప్రిల్ 30వ తేదీ సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు గణపతి ఉత్సవం, అంకురార్పణం నిర్వహిస్తారు. మే 1వ తేదీ ఉదయం 7.30 నుండి 9 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వాహనంపై అగస్తీశ్వరస్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 నుండి 11 గంటల మధ్య స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. ప్రతి రోజు రాత్రి 7.30 గంటలకు స్వామివారి వాహన సేవలు ఉంటాయి. మే 2వ తేదీ సింహ వాహనం, మే 3న హంస వాహనం, మే 4న శేషవాహనం, మే 5న నంది వాహనం, మే 6న గజవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. మే 7న రథోత్సవం కన్నులపండువగా జరుగనుంది. మే 8న రాత్రి 7 గంటలకు కల్యాణోత్సవం, అనంతరం అశ్వవాహన సేవ జరుగనున్నాయి. రూ.500/- చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనే గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం, అన్నప్రసాదాలను బహుమానంగా అందజేస్తారు. మే 9న ఉదయం 9 గంటలకు శ్రీ నటరాజస్వామివారికి అభిషేకం, వీధి ఉత్సవం జరుగనుంది. రాత్రి 7 గంటలకు రావణేశ్వర వాహనంపై అగస్తీశ్వరస్వామి దర్శనమిస్తారు. మే 10న ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కైలాసకోనలో త్రిశూలస్నానం ఘనంగా నిర్వహించనున్నారు.



అదేరోజు రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ కోలాటం, ఆధ్యాత్మిక, భక్తిసంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయ చరిత్రను పరిశీలిస్తే నారాయణవనం ప్రాంతాన్ని పరిపాలించిన శ్రీ పద్మావతీదేవి తండ్రి అయిన శ్రీ ఆకాశ మహారాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడ శ్రీ అగస్తీశ్వరస్వామివారు స్వయంభువుగా వెలిశారు. స్వామివారి లింగాకారానికి పీఠభాగం అనగా బాణపట్టమును అమర్చి వేద ఆగమశాస్త్ర ప్రకారం శ్రీ అగస్త్య మహర్షులవారు ప్రతిష్ఠ చేసి పూజించినందువల్ల స్వామివారికి అగస్తీశ్వరస్వామి అని పేరు వచ్చింది.

# 75 సంవత్సరాల నవ యువ నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు గారు

**ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు**

**75 కేజీల కేక్ కట్ చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రేడ్లు పంపిణీ**

**నాయకులతో కలిసి భారీ బైక్ ర్యాలీ**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు ఏప్రిల్ 21 సోమవారం పట్టణంలో స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో పార్టీ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి 75 సంవత్సరం జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సోమప్ప సర్కిల్ లోని 75 కేజీల భారీ కేక్ ను టిడిపి నాయకులు కార్యకర్తలు మధ్యన కట్ చేసి పార్టీ శ్రేణుల మధ్య కోలాహలంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి 75 సంవత్సరాలు జన్మదిన వేడుకలు టిడిపి పార్టీ శ్రేణులు మధ్య జరుపుకోవడం ఇంత మంది కార్యకర్తలు మహిళలు పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ వయసులో కూడా సీఎంగా చాలా చురుగ్గా ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎంతో ఉత్సాహంగా అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, ఓ ప్రక్కన రాష్ట్ర పరిపాలన సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, మరో ప్రక్కన రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్నారని అందుకే తాను సి.బి.ఎన్ నవ యువ నాయకుడుగా అభివర్ణించానంటూ మీడియాతో అన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మరో 20 సంవత్సరాలు ఆంధ్రప్రదేశ్ సీఎం గా కొనసాగాలంటూ తను ఆశిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల పట్ల వివక్ష చూపుతూ నాయకులకు త్వరలో తగిన బుద్ధి చెబుతాం

**మాల మహానాడు నాయకులు**

**నందికొట్కూరు ఏప్రిల్ 21 ఉ తేజిత ప్రతినిధి**



దళితుల సాంఘిక బహిష్కరణను తీవ్రంగా ఖండిస్తున్నాం నాయకులు. డాక్టర్ వెంకటేష్ తెలిపారు . సోమవారం స్థానిక మాల మహానాడు కార్యాలయంలో పిఠాపురంలో అగ్రవర్ణాల వారు దళితులను గ్రామ బహిష్కరణ చేసిన అంశంపై పత్రిక విలేకరుల సమావేశాలు నిర్వహించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78 సంవత్సరం ల స్వతంత్ర భారత దేశం లో దళితులు ఇంకా వివక్షత కి గురి అవుతూనే ఉన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అంటరానితనం నిషేధం. ఈ నిబంధనలు అగ్రవర్ణాల వారు ఉల్లంఘిస్తున్నారు.కానీ పిఠాపురంలోని అగ్రవర్ణాల వారు గ్రామంలోని దళితుల పట్ల వివక్ష చూపుతూ వారిని అవమానాలకు ఇంకా గురి చేస్తూనే ఉన్నారు అన్ని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో ఆదిపత్యకులాలు ఒక ఊరు ఊరునే బహిష్కరించడం జరిగింది దళితులకు ఏమీ అమ్మకూడదని దళితులకు ఎలాంటి వస్తువులు విక్రయించకూడదు అని బహిరంగంగా అగ్రవర్ణాల వాళ్ళ నిర్ణయించడం సరైనది కాదు అని అన్నారు. ప్రశ్నించే జనసేన పార్టీ అధినాయకుడు పవన్ కళ్యాణ్ ఈ విషయంపై ఇంతవరకు స్పందించకపోవడం బాధాకరం. ఈ అంశాన్ని నందికొట్కూరు మాల మహానాడు కమిటీ తీవ్రంగాఖండిస్తున్నాము.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము తక్షణం స్పందించి మల్లం గ్రామంలో దళితులకు న్యాయం చేయాలని కోరుచున్నాము. దళితుల గ్రామ బహిష్కరణకు కారణమైన వ్యక్తులను చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని కోరుచున్నాము.లేకుంటే మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తాం. ఈ కార్యక్రమంలో తాలుకా మాల మహానాడు ఉపాధ్యక్షులు, మధు, బండారు శ్రీను, సహాయ కార్యదర్శులు పాలమర్రి నాగరాజు, సీనియర్ నాయకులు నాగేంద్ర, రాజు,తదితరులు పాల్గొన్నారు.

# డీజే వాహనాలకు అనుమతులు ఇవ్వద్దంటూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ ఏప్రిల్ 21**



శుభకార్యాలు డిజే వాహనాలకు అనుమతి ఇవ్వొద్దని సోమవారం సి.బెళగల్ మండలంలోని గొల్లల దొడ్డి గ్రామస్తులు సి.బెళగల్ మండలంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శుభ కార్యాలకు డీజె వాహనాలకు అనుమతులు ఇవ్వడం వల్ల రాత్రి 9 గంటల నుండి తెల్లవారే వరకు అధిక శబ్దాలతో పాటలు పాడిస్తూ ఉండడంవల్ల, ఊర్లో ఉన్న గర్భిణీ స్త్రీలకు, చిన్నపిల్లలకు, గుండె జబ్బు కలిగిన వారికి తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయని కావున డీజే వాహనాలకు అనుమతులు ఇవ్వద్దంటూ హెడ్ కానిస్టేబుల్ రమేష్ కు గొల్లలదొడ్డి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల్ రెడ్డి, వెంకటేశ్వర గౌడ్, భాస్కర్ రెడ్డి, చంద్రన్న, జగన్మోహన్ రెడ్డి, కృష్ణమూర్తి, మన్సూర్, చంటి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# వీవర్స్ కాలనీ స్కూల్ సందు రోడ్డు ను వెంటనే బాగు చేయండి! మునిసిపల్ కమిషనర్

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు ఏప్రిల్ 21 సోమవారం వీవర్స్ కాలనీ ప్రజలు బస్ స్టాండ్ కు కాలి నడక మరియు బైక్ మీద పోవడానికి స్కూల్ సందులో చిన్న రోడ్డు కలదు. కానీ రోడ్డు తగ్గులు , మిట్టలు ఉండటం వల్ల వర్షం వచ్చినపుడు నీళ్ళు ఎక్కడికి పోకుండా అక్కడే నిలబడి చాలా గలిజుగా బురుదగా చేరుతుంది. అక్కడే దారిన పోయేవాళ్ళు ,స్కూల్ పిల్లలు మలముత్రాలు కూడా విసర్జిస్తుంటారు. కనుక వీవర్స్ కాలనీ ప్రజలు బస్ స్టాండ్ పోలేక పోతున్నారు. వాసవి కళ్యాణమండపంకు ఉన్న రెండు గేట్లు ఫ్యాంక్షన్ లు ఉన్నపుడు మాత్రమే తెరుస్తారు. మామూలు టైంలో గేట్లు ముస్తూన్నారు. అలా పోకుండా వైఎస్ఆర్ సర్కిల్ , సొమ్మప్ప సర్కిల్ ద్వారా కాలి నడక పోవాలి అంటే చాలా దూరం అవుతుంది. మరియు గాంధీ నగర్ లేక శివ సర్కిల్ ద్వారా కూడా కాలి నడక పోవాలి అంటే చాలా దూరం అవుతుంది. కనుక దయచేసి వీవర్స్ కాలనీ స్కూల్ సందు రోడ్డు ను వెంటనే లెవెల్ గా బాగు చేసి వర్షపు నీళ్ళు నిలబడకుండా చేసి వీవర్స్ కాలనీ ప్రజలు బస్ స్టాండ్ పోయే దూరాన్ని తగ్గించగలరు వీవర్స్ కాలనీ ప్రజలు కోరుతున్నారు.

# మద్దతు ధరలు..ధాన్యం సేకరణ..ఓ మిథ్య !

ఏటా ధాన్యం సేకరన ఓ ప్రహసనంగా మారింది. ధాన్యం పండిస్తున్న అన్నదాతలను అభినందించి, ధాన్యం సేకరించాల్సన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిసతున్నాయి. ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామని ప్రభుత్వాలు చెప్పడం. క్షేత్రస్థాయిలో అలాంటి ఏర్పాట్లు పెద్దగా లేకపోవడం గమనించవచ్చు.

నేటికీ సమగ్ర వ్యవసాయ విధానంపై కేం÷-దరం కూడా ఆలోచన చేయడం లేదు. దీనిపై సమగ్రంగా చర్చించాలన్న ధోరణి కానరావడం లేదు. దేశంలోని అన్నదాతలను ఆదుకోవడంతో పాటు.. దేశానికి అన్నం పెట్టాలన్న దూరదృష్టి నేతల్లో కొరవడింది. ఏం చేస్తే దేశంలో ప్రజలందరికి ఆహార ధాన్యాలు దక్కగలవో చర్చించడం లేదు. పంటలు పండుతున్నా అందరికీ ఆహారాధాన్యాలు నేటికీ అందుబాటులోకి రావడం లేదు. సాగుచట్టాలను రద్దు చేసిన తరవాత కూడా ప్రధాని మోడీ ఈ సమస్యల పై చర్చించడం లేదు. అన్నదాతల ఆదాయం రెట్టింపు చేస్తానన్న హామీలు మాటలకే పరిమితం అయ్యాయి.

# ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ ఏప్రిల్ 21**



2025-26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశం కొరకు సోమవారం నిర్వహించిన ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సి.బెళగల్ మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో ప్రవేశపరీక్షకు 82 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 71 మంది మాత్రమే విద్యార్థులు హాజరయ్యారని, 11 మంది విద్యార్థులు గైహాజరయ్యారని ప్రిన్సిపాల్ వంశీ మోహన్ రావు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తేజిత దినపత్రిక

# గోనెగండ్ల మన ప్రభ రిపోర్టర్ కుమారుడు ఏపీ ఆర్ జె సి లో మెరిసిన ఆణిముత్యం...!

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి గోనెగండ్ల ఏప్రిల్ 21 సోమవారం**



A.HARISH NANI
28-02-2025

ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇంటర్ సెకండ్ ఇయర్ బైపిసిలో 920 మార్కులు సాధించి ఉపాధ్యాయులచే శభాష్ అనిపించుకున్న ఆరెకంటి హరీష్ నాని..కర్నూలు జిల్లా గోనెగండ్ల మండల కేంద్రమైన గోనెగండ్లకు చెందిన ఆరెకంటి హరీష్ నాని ఒకటవ వరకు 4వ తరగతి వరకు గ్రామంలోని పాఠశాలలో చదివాడు. అనంతరం గురుకుల పరీక్షలు రాసి ఉత్తీర్ణుడై ఐదో తరగతి నుండి పదవ తరగతి వరకు పత్తికొండలోని గురుకుల పాఠశాలలో చదివారు. అనంతరం అనంతపురం జిల్లా హిందూపురం మండలం కోడిగెనహల్లి లోని ఏపీఆర్జేసీ పాఠశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇంటర్ బైపిసిలో 494 మార్కులు సాధించి ఉపాధ్యాయులచే శభాష్ అనిపించుకున్నాడు.శని వారం రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఇంటర్ సెకండియర్ లో 920 మార్కులు సాధించాడు.దీంతో గొనెగండ్ల గ్రామంలోని విద్యావంతులు, ప్రజాసంఘాలు, బంధువులు, కుటుంబ సభ్యులు హరీష్ నాని ని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థి హరీష్ నాని మాట్లాడుతూ భవిష్యత్తులో వైద్య విద్య చదివి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సేవ చేయాలను ఉందని అన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన రమేష్ నాయుడు కుటుంబానికి 2007 తోటి ఎస్ ఎస్ సి బ్యాచ్ ఫ్రెండ్స్ ఆర్థిక సాయం అందజేత...!

**2007 టెన్త్ క్లాస్ బ్యాచ్ ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తూ కంటతడి పెట్టుకున్న స్నేహితులు కుటుంబ సభ్యులు..!**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



గోనెగండ్ల ఏప్రిల్ 21 సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని గద్వాల గేరి రామయ్య కుమారుడు రమేష్ నాయుడు గత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. చిన్ననాటి నుండి కలిసిమెలిసి తిరిగి అన్ని విధాల స్నేహబంధాన్ని అలుముకున్న ఎస్ ఎస్ సి 2007 బ్యాచ్ విద్యార్థులు( ఫ్రెండ్స్) 4 తమ మిత్రుడు రమేష్ తమ మధ్య లేడన్న విషయమును జీర్ణించుకోలేక, తమతో పాటు తమలో ఒకడుగా ఉన్నాడు అని రమేష్ కుటుంబానికి అన్ని విధాలుగా 2007 ఎస్ ఎస్ సి బ్యాచ్ విద్యార్థులందరూ 90 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని భార్య వారి పిల్లలపై ఫిక్స్ డిపాజిట్ చేసినట్లు తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో రమేష్ కుటుంబ ంలోని పిల్లలకు చదువుకునేందుకు తగిన ఆర్థిక సహాయ సలహాలు కూడా మా వంతు కృషి మిత్రుడు కుటుంబానికి ఉంటాయని అన్నారు. అలాగే రమేష్ నాయుడు ఫోటో జ్ఞాపికను వారి తండ్రి రామయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల గేరి రంగముని నాయుడు, ఎంపీపీ నసురుద్దీన్ మనవడు ఇమ్రాన్ భాష, గంజల్ల అల్ల బకాష్, కడియాల వెంకటేశ్వర్లు, నగిరి షబ్బీర్, నగిరి చాంద్ బాషా, నందవరం శిక్షావలి, మహబూబ్, ఆర్.ఎం.పి సలీం, మనోహర్ రెడ్డి, బొగ్గు రమేష్, గంజహల్లి , రాము, తదితర మిత్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి విద్యాధికారి సుభాన్

**నందికొట్కూరు ఏప్రిల్ 21 ఉత్తేజిత ప్రతినిధి**



విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని, ఒక లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని నందికొట్కూర్ మండల విద్యాధికారి సుభాన్ అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని అల్వాల కళ్యాణ మండపంలో శ్రీవాణి హై స్కూల్ వార్షిక దినోత్సవ కార్యక్రమానికి ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి సుభాన్ మాజీ డిప్యూటీ డిఈఓ హనుమంతరావు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువు ఒకటేనని ఆ చదువును బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు ప్రస్తుత సమాజంలో ఎక్కువ శాతం సెల్ ఫోన్ బానిసలవుతున్నారని వాటిని పిల్లలు నుండి దూరం చేయడానికి ప్రయత్నం చేయాలని అన్నారు సెల్ ఫోన్ వలన అనేక సమస్యలు వస్తాయని పిల్లలు మానసికంగా ఒత్తిడికి లోనయ్యి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని అన్నారు కాబట్టి ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్ వాడకాన్ని తగ్గించడం చాలా మంచిదని అన్నారు చదువుల్లో క్రమశిక్షణ ఎంత అవసరమని క్రమశిక్షణ లేకపోతే బంగారు భవిష్యత్తుకు బాటలు ఉండవని, విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని అని తెలిపారు విద్యార్థులు చదువుతోపాటు క్రీడా నైపుణ్యాలు పెంచుకొని శారీరక మరియు మానసిక దృఢత్వాన్ని అలవర్చుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించుటకు అవిశ్రాంతముగా కృషి చేయాలని విద్యార్థుల్లో స్ఫూర్తి రగిలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి టు శ్రీనివాసరెడ్డి హెచ్ఎం నాగేశ్వరావు విజయ్ కుమార్ శ్రీనివాసులు విద్యార్థి సంఘం నాయకులు డొక్కా కుమార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

# ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



**నందికొట్కూరు ఏప్రిల్ 21 ఉత్తేజిత ప్రతినిధి**

నందికొట్కూరులోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి లీలా వెంకట శేషాద్రి సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు మండల న్యాయ సేవాధికార సంస్థ తరపున ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు అనంతరం అక్కడ ఉన్న ఖైదీల ఆరోగ్య పరిస్థితుల గురించి, జైలులో అందుతున్న సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత, ఖైదీలకు అందజేయాల్సిన ఉచిత న్యాయ సేవలు అంశాలపై ఆరా తీశారు. కోర్టు వాయిదాలకు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ వారిని సంప్రదించవచ్చని తెలిపారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 కు సమాచారం ను తెలియజేయవచ్చు .కొందరు ఖైదీలు బైలు మంజూరైన జామీను దారులు లేక జైలు లో ఉన్నామని జడ్జి గారికి తెలుపగా వారి కేసులను విచారించి బైలు మంజూరు కొరకు తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు . ఈ కార్య క్రమంలో జైలు సూపర్డెంట్ ఎస్కేఎండీ రఫీ, జైల్ విసిటింగ్ లాయర్ అరుణ్ కుమార్, నాగమద్దిలేటి పాల్గొన్నారు .

# జిల్లా పోలీసు కార్యాలయం నుండి పత్రిక ప్రకటన కొరకు

**జిల్లా ఎస్పి శ్రీ వి. హర్షవర్ధన్ రాజు ఐపిఎస్ గారు ఆదేశాలతో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని సుదూర ప్రాంతాల నుండి వస్తున్న హవాన చోదకులకు విజ్ఞప్తి**

**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, ఏప్రిల్ 21.**



తిరుమల కు సొంత కార్లలో కుటుంబాలతో బయలుదేరి వచ్చే యాత్రికులకు విజ్ఞప్తి:ఇటీవల ఎండా కాలం లో తిరుమల కి వస్తున్న రెండు కార్లు దగ్ధం అయినాయి, అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణా నష్టం జరగలేదు. కానీ రెండు కార్లు పూర్తిగా దగ్ధం అయినాయి ఈ విధంగా కార్లు దగ్ధం అవడానికి కారణాలు ఏమిటి అని నిపుణులను సంప్రదిస్తే కింది కారణాలు తెలియజేశారు. అందరూ తప్పనిసరిగా పాటించాలని మా విజ్ఞప్తి.తిరుమల ఘాట్ రోడ్డులో 500 కిలోమీటర్లపాటు ప్రయాణించిన తర్వాత కార్లు అధిక వేడి చెందడం లేదా మంటలు అంటుకోవడం కొన్ని మెకానికల్ సమస్యలు, పర్యావరణ పరిస్థితులు, మరియు డ్రైవింగ్ శైలుల కారణంగా జరుగుతుంది.

**ఇవి కారణాలు:-**

**1.దీర్ఘదూర ప్రయాణం:**

500 కిమీ లాంటి ప్రయాణం తర్వాత ఇంజిన్ అప్పటికే వేడిగా ఉంటూ ఒత్తిడిలో ఉంటుంది. తక్షణమే తిరుమల ఘాట్ పైకెక్కడం ప్రారంభిస్తే, ఇంజిన్ మరియు ట్రాన్స్మిషన్‌కు అధిక వేడి వస్తుంది.

**2.కొండలు, వంకర రోడ్లు:**

ఘాట్ రోడ్లకు అధిక ఇంజిన్ శక్తి అవసరం. డ్రైవర్లు ఎక్కువగా తక్కువ గేర్లను ఉపయోగిస్తారు, ఇది RPM పెరిగి వేడి పెరుగుతుంది. దిగే సమయంలో తరచుగా బ్రేకింగ్ చేయడం వల్ల బ్రేక్ సిస్టమ్ వేడిగా మారుతుంది.

**3.అధిక లోడుతో వెళ్ళే వాహనాలు:**

తీర్థయాత్రలలో బరువు బ్యాగులు, ఎక్కువ మందిని తీసుకెళ్లడం సాధారణం. ఇది ఇంజిన్‌పై ఒత్తిడిని పెంచి వేడి సమస్యలకు దారితీస్తుంది.

**4.పూర్ మెయింటెన్ వాహనాలు:**

పాత వాహనాలు లేదా సరిగా సర్వీస్ చేయని వాహనాలలో: కూలంట్ లీక్‌లు లేదా తక్కువ స్థాయి కూలంట్పాడైన రేడియేటర్లు లేదా ఫ్యాన్లుఫాల్టీ థర్మోస్టాట్లు పాడిసిపోయిన ఇంజిన్ ఆయిల్ .. వంటివి ఉండే అవకాశం ఉంది. ఇవన్నీ ఇంజిన్ వేడి పెరగడానికి, తీవ్రస్థాయిలో అయితే మంటలు రావడానికి కారణమవుతాయి.

**5.ఇంధన లేదా ఎలక్ట్రికల్ సమస్యలు:**

ఇంధన పైపుల లీక్‌లు లేదా షార్ట్ సర్క్యూట్లు తీవ్రమైన వేడి ఉన్నప్పుడు మంటలు పెటించవచ్చు. దీర్ఘ ప్రయాణం తర్వాత ఉష్ణోగ్రతలు మరియు వైబ్రేషన్లు సమస్యలను పెంచుతాయి.

**6.ఘాట్ ఎక్కిన వెంటనే వాహనాన్ని ఆపడం:**

కొంతమంది డ్రైవర్లు ఘాట్ ఎక్కిన వెంటనే వాహనాన్ని ఆపి ఇంజిన్ ఆఫ్ చేస్తారు. దీని వలన ఫ్యాన్ పని చేయదు, వేడి బయటకు వెళ్లదు, ఫలితంగా హీట్ సోక్ జరిగి మంటలు రావచ్చు.

**భద్రతా సూచనలు:** యాత్రకు బయలుదేరు ముందు బండిని సర్వీసింగ్ చేయించండి. ఇంజన్ ఆయిల్, కూలెంట్ ఆయిల్, బ్రేక్ ఆయిల్, %ాజ% ఆయిల్ తనికి చేయించండి. రేడియేటర్ లీకేజీ తనికి చేయడం . ఫ్యాన్ బెల్ట్ సరిచూసుకోవడం బ్యాటరీ లో డిస్టిల్ వాటర్ తనికి చేసుకోవడం, వైర్ల చుట్టూ చేరిన తూప్పు కడిగించుకోవడం. డ్రైవర్ ప్రతి రెండు గంటలకి ఒకసారి వాహనం ఆపి అయిదు నిమిషాల పాటు నడక చేయడం, స్వల్ప వ్యాయామం చేయడం, బాగా మంచినీరు తీసుకోవడం, టి మరియు అల్పాహారం సేవించడం చేయాలి.. సెల్ ఫోన్ మాట్లాడడానికి దూరంగా ఉండాలి. వాహన dash board మీద థర్మామీటర్, ఆయిల్ గేజ్ మీటర్ పరిశీలిస్తూ ఉండండి, ఏవైనా ఎర్ర బ్లింకర్ కనపడగానే, బండి ఆపి తనికి చేసుకోవాలి. ఘాట్ ఎక్కే ముందు కనీసం 30 నిమిషాలు వాహనాన్ని విశ్రాంతి ఇవ్వండి.ఎక్కే సమయంలో AC ఆఫ్ చేయండి. కూలంట్, ఇంజిన్ ఆయిల్, బ్రేకులు బాగున్నాయో లేదో ముందే తనిఖీ చేయండి.

– బండి దిగే సమయంలో ఎక్కువగా బ్రేక్ వాడకుండా, ఇంజిన్ బ్రేకింగ్ వాడండి.



# పిజిఆర్ఎస్ లోని ప్రతి దరఖాస్తు పరిష్కరిస్తాం

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ ఏప్రిల్ 21**

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని ఇన్చార్జి తహసిల్దార్ పురుషోత్తముడు తెలిపారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు ఇన్చార్జి తహసిల్దార్ పురుషోత్తముడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుందు ఎంపీడీఓ రాణెమ్మ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజల నుంచి 2 దరఖాస్తులు వచ్చాయని ఇన్చార్జి తహసిల్దార్ పురుషోత్తముడు తెలిపారు. రెండు దరఖాస్తులు కూడా సి.బెళగల్ గ్రామంలో రెండు కోట్ల ఖాత కలిగిన భూములను ఆన్లైన్లో నమోదు చేయాలనిదరఖాస్తులు వచ్చాయని ఇంచార్జ్ తహసిల్దార్ తెలిపారు. అయితే కొందరు మండల స్థాయి అధికారులు తరచుగా గైహాజరవుతున్నారు. పిజిఆర్ఎస్ లో కొందరి అధికారులు కేవలం సంతకం చేసి వెళ్లడానికి మాత్రమే వచ్చి వెళుతున్నారు.ఈ కార్యక్రమంలో ఈఓఆర్డిఈశ్వరయ్య స్వామి, ఆర్డబ్ల్యూఎస్ ఏ.ఈ గోనే నాయక్, ఏ.ఓ మల్లేష్ కుమార్, హౌసింగ్ ఏఈ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# సర్వే లో అవకతవకలు జరిగాయని- సిపిఐ (ఏఐకెఎస్)

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**




గోనెగండ్ల:- ఏప్రిల్ 21 సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్ల లో సోమవారం ,సిపిఐ పార్టీ (ఏఐకెఎస్) ఆధ్వర్యంలో రైతులు ,తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చెపట్టారు.ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.పంపన్న గౌడ్, సిపిఐ పార్టీసీనియర్ నాయకులు వి.మద్దిలేటి నాయుడు, రైతు సంఘం నాయకులు బేతాళ పెద్ద భాషులు, పాల్గొన్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోనెగండ్ల మండలం లో భూ సర్వే గత డిసెంబర్ నెలలో నుంచి ప్రారంబించారు.ఇప్పుడు సర్వే అయిన తర్వాత ఒక రైతు భూమి తక్కువ రావడం,మరో రైతుకు భూమి ఎక్కువ రావడం సర్వే లో జరిగింది.గోనెగండ్ల గ్రామంలో ప్రతి రైతుకు 10సెంట్లు నుంచి 50సెంట్లు వరకు తగ్గిపోవడం జరిగింది.ఇలా ప్రతి రైతుకు భూమి తక్కువ వచ్చిందని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ రైతులు బాధ పడుతున్నారు.ఇప్పటికైన రెవిన్యూ సంబంధింత ఆధికారులు స్పందించి వెంటనే భూ సర్వే లో అవకతవకలు జరిగిన భూములను, ప్రస్తుత రైతుల అన్ లైన్ అడంగల్, రిజిస్ట్రేషన్,డ్యాకుమెంట్ ల ప్రకారంగా,సరిచేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.అనంతరం భూ సర్వే సమస్య పై డిప్యూటీ తహశీల్దార్ విష్ణు కుమార్ కు, వినతి పత్రం అందజేశారు.అందుకు స్పందించి డిప్యూటీ తహశీల్దార్ విష్ణు కుమార్ మాట్లాడుతూ భూ సర్వే లో రైతులకు భూమి తక్కువ రావడం వాస్తావం అన్నారు.మేము కూడా రైతులను పిలిపించి వారి పత్రాలు,అన్ లైన్ అడంగల్ పరిశీలించి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమం లో రైతులు రాజశేఖర్ ఆచారి,గోల్ల నాగన్న,కటికే ఖాజబంద,బంద, రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

# మద్దతు ధరలు..ధాన్యం సేకరణ..ఓ మిథ్య !

ఏటా ధాన్యం సేకరన ఓ ప్రహసనంగా మారింది. ధాన్యం పండిస్తున్న అన్నదాతలను అభినందించి, ధాన్యం సేకరించాల్సన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిసతున్నాయి. ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామని ప్రభుత్వాలు చెప్పడం. క్షేత్రస్థాయిలో అలాంటి ఏర్పాట్లు పెద్దగా లేకపోవడం గమనించవచ్చు.

నేటికి సమగ్ర వ్యవసాయ విధానంపై కేం÷-దరం కూడా ఆలోచన చేయడం లేదు. దీనిపై సమగ్రంగా చర్చించాలన్న ధోరణి కానరావడం లేదు. దేశంలోని అన్నదాతలను ఆదుకోవడంతో పాటు.. దేశానికి అన్నం పెట్టాలన్న దూరదృష్టి నేతల్లో కొరవడింది. ఏం చేస్తే దేశంలో ప్రజలందరికి ఆహార ధాన్యాలు దక్కగలవో చర్చించడం లేదు. పంటలు పండుతున్నా అందరికీ ఆహారాధాన్యాలు నేటికీ అందుబాటులోకి రావడం లేదు. సాగుచట్టాలను రద్దు చేసిన తరవాత కూడా ప్రధాని మోడీ ఈ సమస్యల పై చర్చించడం లేదు. అన్నదాతల ఆదాయం రెట్టింపు చేస్తానన్న హామీలు మాటలకే పరిమితం అయ్యాయి. సన్నకారు రైతులకు అండగా ఉన్నానని,ఏటా 6వేల కోట్లు వారి ఖాతాల్లో వేస్తున్నానని ప్రధాని మోడీ గొప్పగా ప్రకటించు కోవడం తప్ప సమగ్ర వ్యవసాయ విధానానికి శ్రీకారం చుట్టడం లేదు. నిజానికి ఖాతాల్లో డబ్బులు వేయడం కాకుండా వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలో ఆలోచించడం లేదు. గ్రామాలను ఆధారం చేసుకుని వ్యవసాయాన్ని పాడి పరిశ్రమను, కోళ్ల పరిశ్రమను ఉమ్మడిగా అభివృద్ధి చేయాలి. దీంతో గ్రామీణ వృత్తులకు కూడా ఆసరా దక్కుతుంది. కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. అకాల వర్షాల కారణంగా భారీగా పంటలు దెబ్బతింటున్న సందర్భంలో వారికి సకాలంలో పరిహారం అందడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 33 శాతానికంటే ఎక్కువ మొత్తంలో పంటలు దెబ్బతింటేనే నష్టపరిహారానికి సిఫార్సు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతున్న నష్టం లెక్కల్లోకి రావడం లేదు. పంటనష్టం అంతకు మించి ఉంటేనే వ్యవసాయాధి కారులు వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. గత కొన్నేళ్లుగా బీమా చేస్తున్న రైతులకు పరిహారం అందేది నామమాత్రంగానే ఉంటుంది. వేల సంఖ్యలో రైతుల పంట నష్టం జరిగినా, రైతులకు అందుతు న్నది మాత్రం తక్కువగానే ఉంటుంది. వర్షాలు కురియడం,పంటను నష్ట పోవడం కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నా అందడం లేదు. బీమా నిబంధనల ప్రకారం నష్టం 33 శాతం దాటితేనే పరిహారం వచ్చే అవకాశం ఉంది. ఈ నిబంధనలను మార్చాల్సి ఉంది. ఇన్సూరెన్స్ ఉన్న రైతులందరికి పరిహారం దక్కడం లేదు. భారీ వర్షాలతో నష్టపోతే రుణాలు తీసుకున్నవారికి ఈ బీమాను అమలు చేయక పోవడంతో రైతులపై అదను భారం పడుతోంది. నిబంధనల ప్రకారం ఐదేళ్ల ఉత్పత్తి ఆధారంగా ఎంత పంటనష్టం జరిగితే అంతే మొత్తాన్ని అందించనున్నారు. అకాల వర్షాలు భారీగా పంట నష్టాన్ని కలిగించి, రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చేతికి వచ్చిన పంటను కాపాడు కునేందుకు రైతులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఈ సమస్యలను అన్నీ చర్చించాలి. తెలుగు రాష్ట్రాల్లో పంట ఏదైనా అమ్ముకోవడం ఓ పెద్ద ప్రహనంగా మారింది. ధాన్యం మార్కెట్లోకి తెచ్చిన తరవాత సవాలక్ష కొర్రీలు పెట్టి రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. చట్టసభల్లోనూ, బయటా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలనుకనీసంగా చర్చించడం లేదు. ప్రపంచానికి అన్నం పెట్టే స్థితిలో భారతదేశం ఉన్నా..వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మాత్రం పాలకులు ముందుకు రావడం లేదు. పక్కా మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం, భారీగా పండుతున్న పంటలను కొనుగోలు చేసే వ్యూహం ప్రదర్శించడం లేదు. పంటల కొనుగోలు సమయంలో సరైన వ్యూహంతో ప్రభుత్వాలు చర్య తీసుకుంటే ఇబ్బందులు రావు. కలెక్టర్లతో ఇటీవల తెలంగాన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించి పంటల కొనుగోళ్లకు పక్కాగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎపిలో మంత్రి అచ్చన్నాయుడు కూడా పంటల కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశామన్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్...నీటి సరఫరా, రైతుబందు కింద పెట్టుబడి సాయం...రైతు చనిపోతే కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతుబీమా పథకం అమలవుతున్నాయి. ఇన్ని పథకాలు ప్రవేశ పెట్టి పంటలు కొనుగోలు చేయకపోతే ఎలా? పంటలు అమ్ముకోవడానికి రైతులు రోడ్డెక్కితే రాజకీయం ఎలా అవుతుంది.? గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, పంటలు కొనుగోలు చేయాలని కోరుకోవడం ఏటా ఓ ప్రహసనంగా మారింది. ఇది ఒక్క తెలంగాణ సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. సీజన్ లో సకాలంలో పంటలు కొనుగోలు చేసి డబ్బులు ముట్టచెప్పితే చాలు.. రైతు సమస్యలు సగం తీరినట్లే.

ఉత్తేజిత దినపత్రిక


# ఆ రైల్వేస్టేషన్‌కు మహర్దశ.. కేంద్రం స్పెషల్ ఫోకస్..



**ఆంధ్రప్రదేశ్:** అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఏపీలోని పలు రైల్వేస్టేషన్లను కేంద్రం అభివృద్ధి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ పథకం కింద నిధులు మంజూరు చేస్తున్న కేంద్రం.. వీటి ద్వారా రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తోంది. ఈ క్రమంలోనే సత్యసాయి జిల్లా ధర్మవరం రైల్వేస్టేషన్‌ను కూడా అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో ఏడున్నర కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అందులో భాగంగా తొలి విడతగా రూ.3.50 కోట్లు విడుదలతో పనులు చేపడుతున్నారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాల్ నిర్మాణం జరుగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే ప్రాజెక్టులపై కేంద్రం స్పెషల్ ఫోకస్ పెట్టిన సంగతి తెలిసిందే. కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్ పనులు జోరందుకున్నాయి. వీటికి తోడు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రాష్ట్రంలోని పలు రైల్వేస్టేషన్లను రైల్వే శాఖ అభివృద్ధి చేస్తోంది. ఈ క్రమంలోనే శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం రైల్వేస్టేషన్ అభివృద్ధిపై రైల్వే శాఖ దృష్టి సారించింది. రైల్వే శాఖ చేపడుతున్న పనులతో త్వరలోనే ధర్మవరం రైల్వేస్టేషన్ కొత్తరూపం సంతరించుకోనుంది. ధర్మవరం రైల్వేస్టేషన్‌ను రైల్వే శాఖ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏడున్నర కోట్లు ఖర్చు చేసి ధర్మవరం రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించనున్నారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా, వారిని కట్టిపడేసేలా రైల్వేస్టేషన్ ఆధునీకరిస్తున్నారు.

ధర్మవరం రైల్వేస్టేషన్‌లోకి అడుగుపెట్టగానే ప్రయాణికులను ఆకర్షించేలా ఆధునీకరిస్తున్నారు. ఆ విధంగా ధర్మవరం రైల్వేస్టేషన్ ఆవరణలో రైల్వే శాఖ అభివృద్ధి పనులు చేపడుతోంది. ఏడున్నర కోట్లతో పనులు చేపట్టనుండగా.. తొలి విడత కింద రూ.3.50 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు. 2014లో ధర్మవరం రైల్వేస్టేషన్ భవనం నిర్మించారు. ధర్మవరం రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల తాకిడి ఎక్కువ. అటు బెంగళూరు వైపు వెళ్లే రైళ్లు, ఇటు తిరుపతి వైపు వెళ్లే రైళ్లు ఈ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ధర్మవరం రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది.

**కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్ పనులు జోరందుకున్నాయి. వీటికి తోడు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రాష్ట్రంలోని పలు రైల్వేస్టేషన్లను రైల్వే శాఖ అభివృద్ధి చేస్తోంది. ఈ క్రమంలోనే శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం రైల్వేస్టేషన్ అభివృద్ధిపై రైల్వే శాఖ దృష్టి సారించింది.**

ఆధునీకరణ పనుల్లో భాగంగా ధర్మవరం రైల్వేస్టేషన్ ముఖ ద్వారం ఏర్పాటు చేశారు. అలాగే కొత్తపేట కూడలి నుంచి ధర్మవరం రైల్వేస్టేషన్ వరకు తారు రోడ్డు వేశారు. స్టేషన్ బయట సిల్క్‌సిటీ బోర్డు ఏర్పాటు చేశారు. ధర్మవరం రైల్వేస్టేషన్ ఆవరణలో ఉద్యానవనం ఏర్పాటు చేయనున్నారు. అలాగే స్టేషన్ వద్ద ఆర్పీఎఫ్ పోలీస్ స్టేషన్, జీఆర్పీ, రైల్వే ఆస్పత్రి భవనం నిర్మించనున్నారు. ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఆరు ప్లాట్‌ఫామ్‌లు ఉండగా.. ప్రయాణికుల కోసం వెయిటింగ్ హాల్ నిర్మించారు. లిఫ్టు, ఆరు ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. 600 మంది ప్రయాణికులు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. త్వరలోనే ఈ పనులు పూర్తి చేయనున్నట్లు ధర్మవరం రైల్వేస్టేషన్ అధికారులు చెప్తున్నారు.



# వైసీపీలో నంబర్ 2 ఎవరంటే..

**ఆంధ్రప్రదేశ్:** మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలకు వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కౌంటర్ ఇచ్చారు. వైసీపీలో నంబర్ 2 నుంచి 2000 స్థానానికి ఆరు నెలల్లోనే దిగజారానంటూ శుక్రవారం విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి ఆరోపణలకు వైవీ సుబ్బారెడ్డి కౌంటర్ ఇచ్చారు. వైసీపీలో నంబర్ 2 పొజిషన్ గురించి వైవీ సుబ్బారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. విజయసాయిరెడ్డి వైసీపీని వీడిన తర్వాత తమపై లేనిపోని అభియోగాలు చేస్తున్నారని వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు.

మాజీ ఎంపీ, వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలకు వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కౌంటర్ ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే తాను వైసీపీలో నంబర్ 2 నుంచి 2000 స్థానానికి పడిపోయాయని విజయసాయిరెడ్డి నిన్న ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే విజయసాయిరెడ్డి ఆరోపణలకు వైవీ సుబ్బారెడ్డి కౌంటర్ ఇచ్చారు. వైసీపీని వీడిన తర్వాత పార్టీపై విజయసాయిరెడ్డి అభియోగాలు మోపుతున్నారని సుబ్బారెడ్డి ఆరోపించారు. వైసీపీలో నంబర్ 2 నుంచి 2000 స్థానానికి పడిపోయానని విజయసాయిరెడ్డి ఆరోపిస్తున్నారన్న వైవీ సుబ్బారెడ్డి.. వైసీపీలో నంబర్ 2 స్థానం అనేది ఎప్పుడూ లేదని.. భవిష్యత్తులోనూ రాబోదని సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు.

వైసీపీలో 1 నుంచి 100 వరకూ అన్నీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డే ఉంటారని క్లారిటీ ఇచ్చారు. పార్టీ అధ్యక్షుడిగా వైఎస్ జగన్.. అందరితో సంప్రదించి నిర్ణయాలు తీసుకునేవారన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో చక్రం తిప్పింది విజయసాయిరెడ్డే కదా అంటూ వైవీ సుబ్బారెడ్డి కౌంటర్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నారని వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. విజయసాయిరెడ్డి ఏదో రకంగా తమపై అభియోగాలు మోపాలని చూస్తున్నారని.. పార్టీలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ చుట్టూ కోటరీ ఉందో లేదో ఆయనకు తెలియదా అని సుబ్బారెడ్డి ప్రశ్నించారు.

మరోవైపు లిక్కర్ స్కామ్?లో సిట్ విచారణకు హాజరైన విజయసాయిరెడ్డి శుక్రవారం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. గెలిచిన ఆరు నెలల్లోనే 2 నుంచి 2000 స్థానానికి పడిపోయానని.. చాలా అవమానాలు పడ్డానని విజయసాయిరెడ్డి అన్నారు. కోటరీ వేధింపులు తట్టుకోలేకపోయినట్లు చెప్పారు. అప్పుడే జగన్ మనసులో తనకు స్థానం లేదని గ్రహించానని.. అందుకే వేదనతో పార్టీని వీడినట్లు విజయసాయిరెడ్డి చెప్పుకొచ్చారు. మరోవైపు ప్రాంతీయ పార్టీల్లో నంబర్ 2 అనేది ఉండదని.. ఈ విషయాన్ని జగన్ కూడా స్వయంగా చెప్పారన్నారు. ప్రాంతీయ పార్టీలలో 1 నుంచి 100 స్థానాల వరకు ఎవరూ ఉండరని.. 101 నుంచే ఉంటాయని విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు.

# ఆమె పదవి పోయింది

**విశాఖపట్నం:** మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో జీవీఎంసీలో కూటమి విజయం సాధించింది. 74 మంది కార్పొరేటర్లు అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేశారు. ఒకటి రెండు రోజుల్లో విశాఖపట్నం నూతన మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఈ పరిణామంతో జీవీఎంసీ రాజకీయాలు వేడెక్కాయి. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఇంకా విశాఖపట్నానికి రాలేదు.

విశాఖపట్నం మేయర్ పీఠం కూటమి ఖాతాలోకి చేరింది.. మహా విశాఖ నగర పాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారిపై కూటమి అవిశ్వాసం నెగ్గింది.. అవిశ్వానికి మద్దతుగా 74మంది కార్పొరేటర్లు ఓట్లు వేశారు. దీంతో గత కొన్ని రోజుల ఉత్కంఠ మొత్తానికి వీడింది. ఇవాళ ఉదయం 11 గంటలకు విశాఖపట్నం జీవీఎంసీ ఇంఛార్జ్ కమిషనర్, కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు హాజరుకాలేదు. అయితే విశాఖపట్నం నూతన మేయర్‌గా పీలా శ్రీనివాసరావును ఒకటి, రెండు రోజుల్లో ఎన్నుకునే అవకాశం ఉందంటున్నారు.



విశాఖపట్నం మేయర్‌పై అవిశ్వాసం ప్రకటించిన తర్వాత జీవీఎంసీ రాజకీయం వేడెక్కింది. వైఎస్సార్‌సీపీ, కూటమి నేతలు కార్పొరేటర్లను క్యాంపులకు తరలించారు. కూటమి పార్టీలకు చెందిన కార్పొరేటర్లు మలేషియా వెళ్లగా.. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ముందుగా బెంగళూరు, అక్కడ్నుంచి శ్రీలంకకు వెళ్లారు. అయితే శనివారం అవిశ్వాస తీర్మానంపై సమావేశ ఉండటంతో కూటమి కార్పొరేటర్లు శుక్రవారం రాత్రి విమానాశ్రయానికి చేరుకున్నారు.. వారిని కూటమి పార్టీల ఎమ్మెల్యేలు హొటల్‌కు తరలించారు. శనివారం ఉదయం 10 గంటలకు వారందరు జీవీఎంసీకి చేరుకున్నారు. అయితే శ్రీలంకకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అధిష్ఠానం ఆదేశాల మేరకుసమావేశానికి దూరంగా ఉండనున్నారు. వీరు ఒకటి, రెండు రోజుల్లో విశాఖపట్నం వచ్చే అవకాశం ఉందంటున్నారు.

జీవీఎంసీలో మొత్తం 97 మంది సభ్యులు ఉన్నారు.. అయితే పార్టీల బలాలను చూస్తే.. టీడీపీకి-48, వైఎస్సార్‌సీపీ-30, జనసేన-14, బీజేపీ-2, సీపీఐ-1, సీపీఎం-1 ఉంది. అయితే వీరిలో వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి ముత్తంశెట్టి కుమార్తె ప్రియాంక ఎవరికీ మద్దతు ప్రకటించలేదు.. ఆమె కూడా కూటమికి మద్దతిచ్చారనే టాక్ ఉంది. కూటమికి ఎక్స్ అఫీషియో సభ్యులు 11 మంది ఉండగా.. వైఎస్సార్సీపీకి ముగ్గురు మద్దతిస్తున్నారు. 74 మంది సభకు హాజరైతే కోరం సరిపోయింది. రెండు రోజుల క్రితం వైఎస్సార్సీపీ నేత బెహరా భాస్కరరావు భార్య, కోడలు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుమారుడు వంశీరెడ్డి కూటమి వైపు వచ్చేయడంతో ఆ బలం మరింత పెరిగింది. మొత్తం మీద జీవీఎంసీ మీద కూటమి జెండా ఎగరవేసింది.

# నాకు సపోర్టుగా ఉన్నందుకు థ్యాంక్స్

**ఆంధ్రప్రదేశ్:** ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన తల్లి విజయమ్మ 69వ జన్మదినం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆమె తన తల్లి గొప్పతనాన్ని కొనియాడుతూ భావోద్వేగపూరిత పోస్ట్ పెట్టారు. నెటిజన్లు కూడా విజయమ్మకు శుభాకాంక్షలు తెలిపారు. అయితే.. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారా లేదా అనేది తెలియరాలేదు. పలువురు రాజకీయ నేతలు, అభిమానులు విజయమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. గతంలో మదర్స్ డే సందర్భంగా కూడా ఆమె పలు రకాల పోస్టులను సోషల్ మీడియాలో పోస్ట్ చేసేది.



అమ్మ ప్రేమకు సాటి లేదు. అమ్మ గుండె వెన్న కన్నా మెత్తన. అమ్మ చూపించే ప్రేమానురాగాలకు వెల కట్టలేం. అలాంటి అమ్మ పుట్టినరోజు వస్తే పిల్లలకు అంతకన్నా ఆనందం ఉండదు. తమ తల్లిని ప్రేమగా చూసుకుంటూ.. ఆమె ఆశీస్సులు తీసుకుంటూ ఆనందంగా గడుపుతారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన తల్లి విజయమ్మ 69వ జన్మదినం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

షర్మిల తన పోస్ట్‌లో అమ్మ గొప్పతనాన్ని కొనియాడుతూ ఎంతో భావోద్వేగంగా రాశారు. 'నాకు జన్మనిచ్చి, నా జన్మకు ఒక అర్థం వచ్చేలా నన్ను ఎల్లప్పుడూ వెన్నంటి ఉండి ప్రోత్సహిస్తున్నారు. అమ్మా, మీరు ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. ఆ దేవుడు మీకు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలను, మనశ్శాంతిని, ఆనందాన్ని ఇవ్వాలని నేను మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను' అని ఆమె పేర్కొన్నారు.

షర్మిల తన తల్లి పట్ల చూపించిన ఈ అపారమైన ప్రేమను చూసి నెటిజన్లు కూడా విజయమ్మకు పెద్ద ఎత్తున పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మదర్స్ డే సందర్భంగా కూడా ఆమె పలు రకాల పోస్టులను సోషల్ మీడియాలో పోస్ట్ చేసేది. తాజాగా ఆమె తల్లి పట్టిన రోజు సందర్భంగా ఇలా సోషల్ మీడియాలో విష్ చేశారు.

విజయమ్మకు ప్రత్యేక శుభాకాంక్షలు

అయితే.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత .. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన తల్లికి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారా లేదా అనే విషయం ఇంకా స్పష్టంగా తెలియలేదు. గత కొంతకాలంగా వైఎస్ కుటుంబంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఈ విషయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటు పలువురు రాజకీయ నాయకులు, వైఎస్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నవారు కూడా విజయమ్మకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అలాగే.. వైఎస్ అభిమానులు కూడా సోషల్ మీడియా వేదికగా విజయమ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.

**వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ ప్రయాణంలో..**

విజయమ్మ ఒక బలమైన మహిళగా.. తన భర్త వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ ప్రయాణంలో వెన్నంటి నిలిచారు. ఆయన మరణానంతరం కూడా పార్టీని ముందుకు నడిపించడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఆమె తన పిల్లలైన జగన్, షర్మిలకు ఒక తల్లిగా, ఒక స్నేహితురాలిగా ఎల్లప్పుడూ అండగా నిలిచారు. ఆమె చూపించే ధైర్యం, నిబద్ధత ఎందరికో స్ఫూర్తిదాయకం. ఈ ప్రత్యేకమైన రోజున ఆమె మంచి ఆరోగ్యం, సంతోషంతో ఉండాలని కోరుకుందాం.

# ఆలయంలో పెళ్లిని ఆపేసిన భక్తులు..

**కాకినాడ:** అన్నవరం దేవస్థానంలో జరుగుతున్న ఓ పెళ్లిలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. పెళ్లి పీటలపై వధువు ఏడుస్తుండటంతో అనుమానం వచ్చిన భక్తులు ఆరా తీయగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. 42 ఏళ్ల వ్యక్తితో తనకు ఇష్టం లేకుండా పెళ్లి చేస్తున్నారని, అంతేకాకుండా తాను మైనర్ అని వధువు చెప్పడంతో భక్తులు, ఆలయ సిబ్బంది వెంటనే పెళ్లిని ఆపేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో పెళ్లి జరుగుతోంది.. వివాహ వేదికపై ఉన్న వధువు ఏడుస్తూ కనిపించింది. అటుగా వెళ్లిన కొందరు భక్తులు ఈ విషయాన్ని గమనించారు.. దగ్గరకు వెళ్లి ఏమైందమ్మా అని ఆరా తీశారు. అప్పుడు ఆమె చెప్పిన మాటలతో భక్తులు అవాక్కయ్యరు.. వెంటనే అక్కడే ఉన్న ఆలయ సిబ్బంది సహకారంతో పెళ్లి తతంగాన్ని ఆపేశారు. ఆ తర్వాత పోలీసులు రంగంలోకి దిగడంతో.. ఈ పెళ్లి పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది.

కాకినాడ జిల్లాలోని అన్నవరం దేవస్థానంలో ఓ పెళ్లికి ఏర్పాట్లు చేశారు. వధువు, వరుడు కుటుంబాల సభ్యులు అక్కడే ఉన్నారు. అయితే పెళ్లి పీటలపై ఉన్న వధువు ఏడుస్తూ కనిపించింది.. ఈ విషయాన్ని ఆలయంలోని కొందరు భక్తులు గమనించి వెళ్లారు. ఏం జరిగిందని ఆరా తీశారు.. అప్పుడు అసలు మ్యాటర్ తెలిసింది.. తనకు 42 ఏళ్ల వ్యక్తిని ఇచ్చి పెళ్లి చేస్తున్నారని ఆ వధువు చెప్పింది.. తనకు ఇష్టం లేకుండా పెళ్లి చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. అయితే వధువు మైనర్ కావడం ఇంకో ట్విస్ట్.. దీంతో భక్తులు, ఆలయ సిబ్బందితో కలిసి పెళ్లి తంతును ఆపేశారు. ఈ పెళ్లి గురించి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.. వారి వివరాలను సేకరిస్తున్నారు. బాలికకు పెళ్లి చేసేందుకు సిద్ధమైన వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ పెళ్లి వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అని అధికారులు, పోలీసులు ఎన్నో సందర్భాల్లో హెచ్చరించారు. గతంలో కూడా ఎన్నో బాల్య వివాహాలను అడ్డుకున్నారు.. తాజాగా అన్నవరం ఆలయంలో ఇలా బాల్య వివాహానికి సిద్ధం కావడం కలకలం రేపింది. చట్ట ప్రకారం 18 నిండిన అమ్మాయిలకే పెళ్లిళ్లు చేయాలి.. కానీ కొన్ని ప్రాంతాల్లో మరీ దారుణంగా 16, 17 ఏళ్లకే పెళ్లి చేస్తున్నారు. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లాలో కూడా ఇద్దరు మైనర్ బాలికల్ని ఒకే యువకుడికి ఇచ్చి పెళ్లి చేసేందుకు సిద్ధమయ్యారు.. సోషల్ మీడియాలో వెడ్డింగ్ కార్డ్ వైరల్ కావడంతో పోలీసులు అడ్డుకున్నారు.

# కాలేజీ భవనం మీద నుంచి దూకి..

**విశాఖపట్నం:** విశాఖపట్నంలో విషాద ఘటన చోటు చేసుకుంది. కాలేజీ భవనం మీద నుంచి దూకి ఓ మెడికో ఆత్మహత్య చేసుకున్నారు. ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ఈ ఘటన జరిగింది. శ్రీరామ్ అనే మెడిసిన్ చదువుతున్న విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డారు. కాలేజీ బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. మరోవైపు శ్రీరామ్ ఆత్మహత్యకు కాలేజీ వైఎస్ ప్రిన్సిపల్ వేధింపులే కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. ఏదేమైనా మంచి భవిష్యత్తు ఉన్న విద్యార్థి ఈ రకంగా ఆత్మహత్య చేసుకోవడంపై తోటి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బీచ్‌లో బాలుడి గల్లంతు..**

మరోవైపు పాతగంగవరం బీచ్‌లో విద్యార్థి గల్లంతైన సంగతి తెలిసిందే. 9వ తరగతి చదువుతున్న తనూష్ అనే విద్యార్థి గురువారం సాయంత్రం గల్లంతయ్యాడు. తనూష్ ఆచూకీ కోసం న్యూపోర్టు పోలీసులు గాలిస్తున్నారు. నేవీ హెలికాప్టర్, డ్రోన్ల సాయంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. యారాడ నుంచి పాత గంగవరం, వాడ చీపురుపల్లి తీరాల మీదుగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే విద్యార్థి ఆచూకీ తెలియడం లేదు. దీంతో బాలుడి కుటుంబం విషాదంలో మునిగిపోయింది. పాతగంగవరం సముద్ర తీరంలోనే నిరీక్షిస్తూ ఉంది. మరోవైపు బాలుడు సముద్రంలో రాళ్ల మధ్యలో చిక్కుకున్నాడేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు.

**బైక్ దొంగలు అరెస్ట్..**

మరోవైపు బైకులు చోరీ చేస్తున్న నిందితుల్ని పోలీసులు అరెస్ట్ చేశారు. విశాఖపట్నం టూటౌన్ పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ పంపించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లిపురానికి చెందిన షేక్ రంజాన్ అనే వ్యక్తి తన ఇంటి ఎదుట ద్విచక్రవాహనం పార్క్ చేశారు. అయితే ఆ వాహనం కనిపించలేదు. దీంతో విశాఖపట్నం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో ఒడిశాకు చెందిన ఇద్దరు చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

# కరెంటు ఛార్జీలు పెంచిందా.. కూటమి ప్రభుత్వం ఏం చెబుతోంది?


**ఆంధ్రప్రదేశ్:** కరెంటు ఛార్జీలు పెరిగాయంటూ సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. దీనిపై ప్రతిపక్ష వైసీపీ.. అధికార కూటమిపై తీవ్రంగా మండిపడుతోంది. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నపుడు కరెంటు ఛార్జీలు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీలను పోల్చుతూ నెట్టింట పోస్ట్‌లతో వైరల్ చేస్తున్నారు. అయితే దీనిపై తాజాగా ప్రభుత్వం స్పందించింది. కరెంటు ఛార్జీల పెంపు గురించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఒక క్లారిటీ ఇచ్చింది.

ఏపీలో చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. అయితే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీలు ఇష్టం వచ్చినట్లు పెంచారంటూ ప్రతిపక్ష వైసీపీ నేతలు.. తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. రాష్ట్రంలో కరెంటు ఛార్జీలు పెంచారంటూ.. గత ప్రభుత్వంలో వచ్చిన బిల్లులు, ఇప్పుడు వచ్చిన బిల్లులను చూపిస్తూ.. కొత్త ప్రచారం సోషల్ మీడియాలో జరుగుతోంది. దీంతో రాష్ట్రంలో ప్రజలు కరెంటు బిల్లుల విషయంలో తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

ఏపీలో కరెంటు బిల్లులు పెరిగాయంటూ వైసీపీకి చెందిన సోషల్ మీడియా అకౌంట్లలో వార్తలు షేర్ అవుతున్నాయి. ఎక్స్ అకౌంట్ నుంచి పేపర్ కటింగ్‌లు షేర్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. "ఓట్లేయ్యండి తమ్ముళ్లూ..! మేం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచం..! పైగా తగ్గిస్తాం..! నేను గ్యారెంటీ..! అంటూ ఎన్నికల ముందు హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే విద్యుత్‌పై శ్వేతపత్రం విడుదల చేసి ఛార్జీలు పెంచనని నేనెప్పుడు చెప్పా? అంటూ మాట మార్చేశారు. ఎడాపెడా విద్యుత్ షాక్‌లిస్తున్నారు" అంటూ క్యాప్షన్ ఇచ్చారు.

అయితే ఏపీలో కరెంటు ఛార్జీలు పెంచారంటూ చేస్తున్న ప్రచారంలో నిజం లేదని స్వయంగా ప్రభుత్వమే ప్రకటించింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పైసా కూడా విద్యుత్ బిల్లులు పెంచలేదని స్పష్టం చేసింది.

ఏపీలో కరెంటు ఛార్జీలను చంద్రబాబు ప్రభుత్వం పెంచిందా లేదా అనేది తెలుసుకునేందుకు మా సజగ్ టీమ్ విస్తృత పరిశోధనలు చేసింది. ప్రభుత్వం నుంచి కరెంటు బిల్లుల పెంపునకు సంబంధించి.. ఏదైనా అధికారిక ప్రకటన వెలువడిందా అని గూగుల్‌లో సెర్చ్ చేయగా.. అలాంటిదేమీ కనిపించలేదు. అంతేకాకుండా కరెంటు బిల్లులకు సంబంధించి.. ప్రభుత్వం ఇచ్చిన క్లారిటీలపై కొన్ని మీడియా సంస్థలు వార్తలను ప్రచురించాయి.



ఇక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నకిలీ వార్త కట్టడి కోసం తీసుకువచ్చిన సోషల్ మీడియా అకౌంట్లలో చెక్ చేయగా.. అసలు విషయం బయటికి వచ్చింది. అనే ఎక్స్ అకౌంట్ నుంచి.. ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అదే అకౌంట్ నుంచి ఫేస్‌బుక్‌లో కూడా పోస్ట్ చేసింది. వైరల్ అవుతున్న సోషల్ మీడియా పేపర్ క్లిప్‌ను రీట్వీట్ చేస్తూ.. సర్కార్ నిజా నిజాలు వెల్లడించింది. "ప్రస్తుత ప్రభుత్వం ఎడాపెడా విద్యుత్ ఛార్జీలు పెంచేసినట్టు కొందరు చేస్తున్న ఈ ప్రచారం అబద్ధం. కొత్త ప్రభుత్వం వచ్చాక, కరెంటు ఛార్జీలు పైసా కూడా పెంచలేదు. ఇవన్నీ 2022-24 మధ్య వేసిన ఛార్జీలేనని తేల్చి చెప్పింది. అంతేకాకుండా 2022-23లో ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరిట రూ.6,300 కోట్ల ట్రూ అప్ ఛార్జీలు... అలాగే 2023-24లో మరోసారి ఇంధన సర్దుబాటు ఛార్జీల కింద రూ.9,200 కోట్ల ఛార్జీలు వేయడం జరిగిందని ప్రభుత్వం పేర్కొంది. ఆనాటి ఛార్జీల భారమే ఇప్పుడు వినియోగదారుల మీద పడుతోందని తెలిపింది. అంతేకాని కొత్త ప్రభుత్వం వచ్చాక కరెంటు ఛార్జీలు పైసా కూడా పెంచలేదని మరోసారి చెబుతున్నామని.. కాబట్టి ఇలాంటి ఫేక్ ప్రచారాలను నమ్మొద్దని స్పష్టం చేసింది.

# టూత్‌పేస్ట్‌తో పళ్లేకాదు.. ఇవి కూడా మెరిపించేయండి..!




మన పళ్లను తళతళ మెరిపించడమే కాదు.. ఇంకా చాలా పనులే చేస్తుంది. టూత్‌పేస్ట్ ఇంకా ఎన్ని రకాలుగా వాడుకోవచ్చు.. ఏమి శుభ్రం చేయడానికి ఉపయోగ పడుతుందో ఈ స్టోరీలో చూద్దాం. కొన్నిసార్లు అనుకోకుండా కాఫీ కప్పు చేయి జారి.. నేలపై పడితే ఈజీగానే శుభ్రం చేసుకోవచ్చు. కానీ, అవి గోడ మీద పడితేనే.. ఆ మరకలను తొలగించడం చాలా కష్టం. ఈ మరకలను తొలగించడానికి టూత్‌పేస్ట్ ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. గోడపై టూత్‌పేస్ట్ మరకలను తొలగించడానికి.. టూత్‌పేస్ట్‌ను మరకలపై అప్లై చేసి రుద్దండి. అలా కొన్ని నిమిషాలు వదిలేసి.. ఆ తర్వాత తడి క్లాత్‌తో తుడవండి. ఇలా చేస్తే మరకలు మాయం అవుతాయి. వెండి సామన్లు క్లీన్ చేయడానికి చాలా కష్టపడుతుంటారు. టూత్‌పేస్ట్‌తో వెండి సామాన్లను తళతళ మెరిపించవచ్చు. టూత్‌పేస్ట్‌ను వెండి సామాన్లకు అప్లై చేసి.. ఆ తర్వాత తడి చేసుకుంటూ బ్రష్‌తో రుద్దండి. ఆ తర్వాత నీళ్లతో శుభ్రం చేయండి. ఇలా చేస్తే.. వెండి సామాన్లు నలుపు పోయి.. మంచిగా మెరుస్తాయి.

తెల్ల షూస్ త్వరగా మాసిపోతాయ్. వీటిని పూర్వస్థితికి తీసుకురావడం కాస్త కష్టమనే చెప్పాలి. మీ వైట్ షూస్ తిరిగి మెరవాలంటే.. టూత్ పేస్ట్ సహాయపడుతుంది. చెంచా చొప్పున వైట్ టూత్‌పేస్ట్, బేకింగ్ సోడా తీసుకొని, కొద్దిగా నీటిని కలిపి మరకలు ఉన్న చోట రాయండి. నీటితో తడి చేసుకుంటూ బ్రష్‌తో రుద్ది, ఆపై తడి వస్త్రంతో తుడిస్తే కొత్తవాటిలా మెరుస్తాయి. ఫోన్ ట్రాన్స్‌పరెంట్ కవర్లు.. కొన్ని రోజుల తర్వాత పసుపు రంగులోకి మారతాయి. వాటిని తిరిగి మెరిపించడానికి.. టూత్‌పేస్ట్ సహాయపడతాయి. మీ ఫోన్ కవర్ మీద.. దాని మీద కొన్ని నీళ్లను చిలకరించి, తెల్లని పేస్టుతో రుద్ది కాసేపు అలా వదిలేయండి. తర్వాత నీటితో శుభ్రం చేస్తే కొత్తదానిలా కనిపిస్తుంది.

# ఈ 3 పనులు చేసేవారికి త్వరగా ముసలితనం వస్తుందట..







ఎన్ని ఏళ్ళొచ్చినా యంగ్‌గా కనిపించాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ, తెలిసీతెలియక చేసే కొన్ని తప్పుల వల్ల త్వరగా ముసలివారైపోతారట.. అవేంటో తెలుసుకోండి. ఈ 3 పనులు చేసేవారికి త్వరగా ముసలితనం వస్తుందట..వయసు పెరుగుతుందంటే ఎవరికైనా అందంగా కనిపించే విషయంలో కాస్తా భయమే ఉంటుంది. అందుకే ఎప్పుడు కూడా చిన్నవారిగానే కనిపించేందుకు యంగ్ లుక్‌ని ఇచ్చే క్రీమ్స్, ప్రోడక్ట్స్ వాడడం, మంచి డైట్, ఎక్సర్‌సైజ్ చేయడం వంటి ఫాలో అవుతారు. తమని తాము చిన్నవారిలా చూసుకునేందుకు ఆరాటపడతారు. కొన్ని తప్పులు చేయకుండా ఉండాలి. అవేంటో తెలుసుకోండి.

ఎక్కువగా పని.. సామర్థ్యానికి మించిన పని చేయడం వల్ల త్వరగా వృద్ధాప్య ఛాయలు కనిపించేలా చేస్తాయని చెబుతున్నారు నిపుణులు. ఏ పని అయినా పట్టుదలతో పాటు క్రియేటివిటీగా చేస్తే త్వరగా పనులు పూర్తవ్వడమే కాకుండా శ్రమ తగ్గుతుంది. కాబట్టి, స్మార్ట్‌గా ఆలోచించి అలా పనిచేయడం చాలా ముఖ్యం. అతిగా తినడం.. మనం ఆరోగ్యంగా ఉండడానికి ఆహారం ఎంత ముఖ్యమో, అందంగా కనిపించడంలోనూ డైట్ అంతే కీ రోల్ పోషిస్తుంది. ఆహారం ఎంత తినాలో తెలిసి ఉండడం చాలా ముఖ్యం.





ఫుడ్ ఎక్కువగా తిన్నా, తక్కువగా తిన్నా అంత మంచిది కాదు. ముఖ్యంగా ఎక్కువగా తిన్నామంటే బరువు పెరిగి త్వరగా ముసలి వారిలా కనిపిస్తారని చెబుతున్నారు నిపుణులు.

నిద్ర.. ఇది కూడా త్వరగా ముసలివారిలా కనిపించేలా చేస్తుంది. ఎక్కువగా నిద్ర పోయినా, అసలే నిద్రలేకపోవ డం వల్ల అకాల వృద్ధాప్యం వస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే నిద్రసరిగ్గా ఉండేలా చూసుకోండి.

చివరిగా.. వృద్ధాప్యం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వస్తుంది. దానికి కంగారు పడాల్సిన అవసరం లేదు. కానీ, మనసులో ముసలితనం వచ్చినట్టుగా ఫీల్ అయితే వయసులో కూడా ముసలివారిలానే ఫీల్ అవుతారు. కాబట్టి, థింక్ యంగ్.. స్టే యంగ్..

# గ్యాస్, ఎసిడిటీ సమస్యలు రావు..!







ఈ రోజుల్లో పని ఒత్తిడిని తట్టుకోవాలంటే.. ఏడాదికి ఒకసారైనా టూర్లకు వెళ్లాల్సి ందే. తెలియని ప్రదేశాలకు వెళ్తే.. మనలో తెలియని ఉత్సాహం నిండుతుంది. ఈ రోజుల్లో చాలామంది గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలతో ఇబ్బంది పడుతు న్నారు. ఇలాంటి వారు టూర్స్‌కు వెళ్లినప్పుడు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. జీర్ణ సమస్యల వల్ల.. టూర్ కూడా సరిగ్గా ఎంజాయ్ చేయలేరు. విహారయాత్రకు వెళ్లేవారు.. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యలు ఉండవని నిపుణులు అంటున్నారు. బ్రేక్‌ఫాస్ట్ తక్కువ గా తినండి..కొంతమంది బ్రేక్‌ఫాస్ట్ హెవీ గా తింటూ ఉంటారు. టూర్లకు వెళ్లినప్పు డు హెవీగా తింటే.. రోజంగా హెవీగా, ఇబ్బందిగా అనిపిస్తుంది. దీంతో, ఏ పనీ సరిగ్గా చేయలేరు. బ్రేక్‌ఫాస్ట్ తక్కువగా తిన్నా.. త్వరగా నీరసం వచ్చేస్తుంది. మీరు టూర్‌లో ఉన్నప్పుడు మీ బ్రేక్‌ఫాస్ట్‌లో నట్స్, డ్రై ఫ్రూట్స్ వంటి బలవర్ధకమైన ఆహారం చేర్చుకోండి. ఇలా చేస్తే.. రోజంతా యాక్టివ్‌గా ఉంటారు.

ఫ్రెష్ ఫుడ్ తినొచ్చు.. కొంతమంది టూర్లకు వెళ్లినప్పుడు.. లోకల్ ఫుడ్ తినడానికి జంకుతారు. అవి పడకపోతే.. హెల్త్ పాడవుతుందని అనుకుంటూ ఉంటారు. అయితే తాజాగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదంటున్నారు నిపుణులు. ఒకేసారిగా కాకుండా.. మితంగా ఎక్కువసార్లు తింటే మంచిది.

ఇంటి నుంచి తీసుకెళ్లండి.. కొంతమందికి బయట ఫుడ్ పడదు. కాబట్టి, ఇంటి నుంచే కొన్ని రకాల పదార్థాలను తీసుకెళ్లడం మంచిదంటున్నారు నిపుణులు. ఒకవేళ బయట ఫుడ్ తిన్నా.. ఒకేసారి ఎక్కువగా కాకుండా తక్కువ మొత్తంలో ఎక్కువసార్లు తింటే ఎలాంటి సమస్యా ఉండదు. కొంతమంది అజీర్తి సమస్యలతో టూర్ ఎంజాయ్ చేయలేరు. ఇలాంటి వారు వారి డైట్‌లో పెరుగు తప్పకుండా తీసుకోవాలి. అలాగే శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం కోసం క్రమం తప్పకుండా నీళ్లు తాగుతుండాలి.

# కాలి గోర్ల చివర్లలో నొప్పి, వాపుగా ఉందా..







చాలా మందికి కాలి బొటనవేళ్ళల్లో నొప్పిగా ఉంటుంది. చివర్లకి వాపు వచ్చి నొప్పిగా అనిపిస్తుంది. దీనికి గోళ్ళ ఫంగస్ కారణం. మరి దీనికి ఎలాంటి టిప్స్ పాటించాలో ఇప్పుడు చూద్దాం. నెయిల్ ఫంగస్. గోర్లలో ఫంగస్ కారణంగా చాలా సార్లు సమస్య వస్తుంది. దీంతో వేళ్ళలో నొప్పి ప్రారంభమవుతుంది. అది అలానే కొనసాగితే గోర్ల ఆకృతి, రంగు కూడా మారుతుంది. దీనికి చక్కని ఇంటి చిట్కాలు ఉన్నాయి. వీటిని ఫాలో అయితే సమస్య చాలా త్వరగా తగ్గిపోతుంది. కారణాలు.. గోర్ల నొప్పి, పుండ్లు కావడానికి కొన్నిసార్లు సరిగా క్లీన్ చేయకపోవడం, ఇన్ గ్రోన్ టో నెయిల్స్ కారణంగా సమస్య వస్తుంది. చాలా మంది ఈ సమస్యతో బాధపడుతుంటారు. దీని వల్ల నొప్పి ఇబ్బందిగా ఉంటుంది. ఈ సమస్యని ఇంట్లోనే తగ్గించుకోవచ్చు. అవేంటో తెలుసుకోండి.

యాపిల్ సైడర్ వెనిగర్.. ఇందులో ఎక్కువగా యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. కాస్తా నీటిలో యాపిల్ సైడర్ వెనిగర్ వేసి అందులో పాదాలని ఉంచండి. ఎసిటిక్ యాసిడ్ అనే సమ్మేళనం ఏండే ఈ వెనిగర్ మీ యాసిడ్ ఇన్ఫెక్షన్ వ్యాప్తిని తగ్గించడంలో హెల్ప్ అవుతుంది. దీని వాసనని తట్టుకోలేని వారు ఏదైనా ఎసెన్షియల్ ఆయిల్ కలపొచ్చు.

బ్లాక్ టీ.. గోళ్ళ ఫంగస్ సమస్యని దూరం చేసేందుకు బ్లాక్ టీ కూడా టానిక్‌లా పని చేస్తుంది. ఇది గోళ్ళ ఫంగస్, ఇన్ఫెక్షన్ పెరుగుదలని తగ్గించడంలో హెల్ప్ చేస్తుంది. దీని కోసం మీరు డీకాషన్ తయారు చేసి అది గోరువెచ్చగా అయ్యాక కాళ్ళని అందులో నానబెట్టండి.

వెల్లుల్లి.. వెల్లుల్లి శక్తివంతమైన యాంటీ మైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇందులో అలిసిన్ అనే యాంటీ ఫంగల్ ఏజెంట్ ఉంది. దీనిని నేరుగా దంచి పెట్టడం లేదా రసం రాయండి. అరగంట అలానే ఉంచి తర్వాత క్లీన్ చేయండి.






బేకింగ్ సోడా.. బేకింగ్ సోడా ఫంగస్‌కి కారణమయ్యే తేమని గ్రహించగలదు. బేకింగ్ సోడాను కొద్దిగా నీటితో కలిపి పేస్టులా చేయండి. దీనిని ఇన్‌గ్రోన్ గోర్ల చుట్టూ రాయండి. 15 నుండి 20 నిమిషాల పాటు ఉంచి తర్వాత గోరువెచ్చని నీటితతో క్లీన్ చేయండి.

నిమ్మరసం.. అనేక రకాల ఆరోగ్య సమస్యలకి పరిష్కారమని చెప్పొచ్చు. ఇన్ఫెక్షన్లని దూరం చేయడానికి నిమ్మరసం బాగా పనిచేస్తుంది. నిమ్మరసాన్ని రాయడం వల్ల సమస్య చాలా వరకూ తగ్గుతుంది.

# యాంటీ ఆక్సిడెంట్ రిచ్ డైట్..









రోజంతా అలసటగా అనిపిస్తుందా..? ఎలాంటి కారణంగా లేకుండాకండరాలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారా..? మీ చర్మం నిర్జీవంగా మారిందా..? నీరసంగా, నిస్సత్తువగా ఉంటుందా..? మీ సమాధానం అవునూ అయితే.. మీ ఆహారంలో యాంటీఆక్సిడెంట్లను ఎక్కువగా తీసుకోవాలి. యాంటీఆక్సిడెంట్లు.. మీ శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి రక్షించడానికి సహాయపడతాయి. మనం రోజూ తీసుకునే ఆహారం ద్వారా ఉత్పత్తి అయ్యే టాక్సిన్స్, ఆక్సిడెంట్లను బయటకు పంపడంలో యాంటీఆక్సిడెంట్లు కీలక పాత్ర పోషిస్తాయి. మన శరీరంలో వ్యర్థాలు ఎక్కువగా పేరుకుంటే.. ఇమ్యూనిటీ వీక్ అవుతుంది, ఆరోగ్యం క్షీణిస్తుంది. అందుకే, మన డైట్‌లో యాంటీఆక్సిడెంట్ రిచ్ ఆహారం తీసుకోవాలని నిపుణులు అంటున్నారు. యాంటీఆక్సిడెంట్ వల్ల టాక్సిన్స్‌ను తొలగిస్తుంది.. హార్వర్డ్ మెడికల్ స్కూల్ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం శరీరంలో పేరుకున్న టాక్సిన్స్‌ను తొలగిస్తుంది. యాంటీఆక్సిడెంట్లు తమ స్వంత ఎలక్ట్రాన్‌లను దానం చేసి.. ఫ్రీ రాడికల్స్‌ను న్యూట్రల్ చేస్తుంది. ఈ ప్రక్రియ మీ శరీర కణాలలోని.. ఇతర అణువులకు హాని కలిగించే.. ఆక్సిడెంట్ల గొలుసు ప్రతిచర్యను విచ్ఛిన్నం చేస్తుంది.

శక్తిని మెరుగుపరుస్తుంది.. ఇది శరీరాన్ని డిటాక్స్ చేసి.. శరీర సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇది మీ శరీరానికి శక్తిని అందిస్తుంది. జర్నల్ ఆఫ్ క్లినికల్ బయోకెమిస్ట్రీ న్యూట్రిషన్‌లో ప్రచురించిన పరిశోధన ప్రకారం, యాంటీఆక్సిడెంట్-రిచ్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల "ఏరోబిక్ గ్లూకోజ్ మెటబాలిజం" ద్వారా శక్తి ఉత్పత్తిని పెంచవచ్చు.

గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.. యాంటీఆక్సిడెంట్లు.. శరీర కణాలను నాశం చేసే ఫ్రీ రాడికల్స్‌ను తొలగిస్తుంది, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తుంది. ఇది ధమనుల ద్వారా రక్తం, ఆక్సిజన్ ప్రవాహాన్ని మెరుగుపరుస్తుందని, గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుందని.. అధ్యయనాలు చెబుతున్నాయి.

చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి.. యాంటీఆక్సిడెంట్లు.. చర్మాన్ని సూర్యరశ్మి నుంచి రక్షిస్తాయి. మీ కణాలలో రక్త ప్రసరణను పెంచుతాయి, చర్మ తేమను నిర్వహిస్తాయి. యాంటీఆక్సిడెంట్లు.. వృద్ధాప్య ఛాయలు తర్వగా రాకుండా అడ్డుకుంటాయి.

కంటి చూపును రక్షిస్తాయి.. పీర్ - రివ్యూడ్ జర్నల్ ప్రకారం ఆకుపచ్చ కూరగాయలలో ఉండే.. లుటిన్, జియాక్సింతిన్ వంటి పోషకాలు యాంటీఆక్సిడెంట్‌లుగా పనిచేస్తాయి. ఇవి కంటి సంబంధిత సమస్యల ముప్పును తగ్గిస్తాయని నిపుణులు అంటున్నారు. విటమిన్ సి, ఇ కూడా యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఇవి కంటి సమస్యలను నివారిస్తాయి.

ఈ ఫుడ్స్‌లో ఉంటాయి.. యాంటీ ఆక్సిడెంట్లు ఆహారం ద్వారానే వస్తాయి. ఆకు కూరలు, కాయగూరలు, పండ్లలోనే ఇవి లభిస్తాయి. యాంటీఆక్సిడెంట్లు.. ఎక్కువగా క్యారెట్, క్యాబేజీ, టమాట, ఉల్లి, దుంపలు, బీన్స్, చిక్కుళ్లు, యాపిల్, దానిమ్మ, ద్రాక్ష, బొప్పాయి, గ్రీన్ టీ, ఆలీవ్ ఆయిల్, తెనే లాంటి వంటి ఆహార పదార్థాల్లో ఎక్కువగా కనిపిస్తాయ్.

# బొప్పాయి జ్యూస్ తాగితే ఈ లాభాలన్నీ పక్కా..









బొప్పాయి పండు ఆరోగ్యానికి హెల్ప్ చేస్తుంది. దీనిని తాగడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. అవేంటో తెలుసుకోండి. రోజూ బొప్పాయి జ్యూస్ తాగితే ఈ లాభాలన్నీ పొందడం పక్కా.. పిల్లల నుంచి పెద్దల వరకూ ఇష్టపడే పండ్లలో బొప్పాయి పండు ఒకటి. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ బొప్పాయి రసాన్ని 30 నుండి 50మిల్లీ లీటర్ల వరకూ రోజూ తీసుకుంటే కొన్ని లాభాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు నిపుణులు.

హెల్త్ బెనిఫిట్స్.. బొప్పాయి పండులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల ఆకలి కంట్రోల్ అవుతుంది. దీంతో బరువు తగ్గుతుంది. దీంతో పాటు జీవక్రియని మెరుగ్గా చేస్తుంది. ఇది ముఖ్యంగా పిల్లల్లో కడుపులోని పురుగులని చంపుతుంది. దీంతో పాటు చాలా లాభాలు ఉన్నాయి.

పీరియడ్ పెయిన్స్.. బొప్పాయిలో గర్భాశయంలోని వ్యర్థాలు, ట్యాక్సిన్స్‌ని బయటకు పంపే శక్తి ఉంది. ఇది రుతుస్రావం సమయంలో వ్యర్థాలను బయటకు పంపుతుంది. కడుపు నొప్పిని తగ్గిస్తుంది. గర్భం దాల్చాలనుకునే మహిళలు దీనికి దూరంగా ఉంటే చాలా మంచిది. దీనిని రోజుకి 30 మిల్లీగ్రాముల వరకూ తీసుకోవచ్చు. ఇందులో హార్మోన్ల అసమతుల్యతని కూడా హెల్ప్ చేస్తుంది.

బొప్పాయిలో విటమిన్ ఎతో పాటు యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. కాబట్టి, జ్యూస్‌ని తక్కువగా మోతాదులో ఉంటాయి. ముఖ్యంగా పురుషుల్లో ప్రొస్టేట్ క్యాన్సర్, మహిళల్లో రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

శరీర బరువు తగ్గడం.. పండ్లు బరువు తగ్గించేందుకు బొప్పాయి పండు హెల్ప్ చేస్తుంది. ఇందులోని ఫైబర్ ఎక్కువగా ఉండడం చాలా మంచిది. దీని వల్ల జీర్ణ సమస్యలు, మలబద్ధకం దూరమవుతుంది. ఇందులో విటమిన్ ఎ సహా పోషకాలు ఉంటాయి. దీంతో జీర్ణక్రియ పెరిగి చెడు కొలెస్ట్రాల్ కొవ్వుని తగ్గిస్తుంది. రోజూ ఉద యాన్నే బొప్పాయి తీసుకుంటే బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తుంది. చర్మ కాంతి చర్మాన్ని అందంగా మార్చడంలోనూ ఈ పండ్లు చాలా కీ రోల్ పోషిస్తాయి. ఇందులో విటమిన్ ఎ, పొటాషియలు ఉన్నాయి. ఇవి చర్మ సమస్యల్ని దూరం చేసి చర్మాన్ని హైడ్రేట్ చేస్తాయి. ఇది చర్మంలో మృతకణా లను దూరం చేసి ముఖానికి రక్త ప్రసరణ పెంచి డార్క్ కాంప్లెక్షన్ ని తగ్గించి మంచి రంగు వస్తుంది.

ఇమ్యూనిటీ.. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఇమ్యూనిటీని పెంచుతాయి. దీంతో చాలా వరకూ సీజనల్ సమస్యలు, జ్వరం, జలుబు వంటి సమస్యల్ని దూరం చేస్తుంది.



## క్రికెట్ పిచ్చే రూ.3900 కోట్ల విలువైన భూమిని కాపాడింది..!

హైదరాబాద్: తాను క్రికెట్ ఆడుకునే స్థలం కబ్జాకు గురికావడంతో ఓ బాలుడు హైడ్రా కమిషనర్‌కు లేఖ రాశాడు. స్పందించిన అధికారులు జూబ్లీహిల్స్ ప్రాంతంలో రూ.3900 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. నార్నె ఎస్టేట్స్ అనే సంస్థ భూమిని ఆక్రమించి అమ్మడానికి ప్రయత్నించగా.. నిర్మాణాలు నిలిపివేశారు. బాలుడి చొరవతో వేల కోట్ల విలువైన భూమిని పరిరక్షించారు.

ఆ బాలుడికి క్రికెట్ అంటే పిచ్చి.. స్కూల్ అయిపోగానే సమీపంలోని గ్రౌండ్‌కు వెళ్లి స్నేహితులతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుకునేవాడు. గత కొన్నేళ్లుగా ఇదే తంతు. అయితే ఉన్నట్లుండి కొన్ని నెలల నుంచి తాను క్రికెట్ ఆడుకునే గ్రౌండ్ సమీపంలో భారీ నిర్మాణ పనుల మొదలయ్యాయి. గ్రౌండ్ చుట్టూ కంచె వేయటం, నిర్మాణం కోసం గ్రౌండ్‌లో పెద్ద పెద్ద గోతులు తవ్వటం ప్రారంభించారు. నిర్మాణ పనులతో క్రికెట్ ఆడుకునేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో తాను ఆడుకునే క్రికెట్ గ్రౌండ్‌ను కాపాడుకోవాలనుకున్న బాలుడు హైడ్రాకు లేఖ రాశాడు. ఆ లేఖే రూ. 3900 కోట్ల విలువైన భూమిని కాపాడేలా చేసింది.

వివరాల్లోకి వెళితే.. లంగర్‌హౌజ్‌కు చెందిన ఒక బాలుడు చాలా సంవత్సరాలుగా జూబ్లీహిల్స్ జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ దగ్గర ఉన్న ఖాళీ స్థలంలో క్రికెట్ ఆడుకునేవాడు. అయితే కొంతకాలంగా ఆ స్థలానికి వెళ్ళడానికి వీలు లేకుండా పోయింది. అక్కడ కంచె వేయడం, నిర్మాణాలు చేయడం మొదలుపెట్టారు. దీంతో ఆ బాలుడు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు లెటర్ రాసి విషయం చెప్పాడు. బాలుడు రాసిన లేఖపై హైడ్రా కమిషనర్ స్పందించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. ఆ భూమి ప్రభుత్వానిదని, ప్రస్తుతం అది కోర్టులో వివాదంలో ఉందని గుర్తించారు. బాలుడు ఇచ్చిన సమాచారంతో అధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. ఆ స్థలాన్ని పరిశీలించి అక్కడ జరుగుతున్న నిర్మాణాలను ఆపేశారు. నార్నె ఎస్టేట్స్ అనే సంస్థ భూమిని ఆక్రమించి అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని తెలుసుకుని వెంటనే కూల్చివేతలు మొదలుపెట్టారు.

ఈ భూమి నిషేధిత జాబితాలో ఉందని కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. కోర్టులో కేసులు నడుస్తున్నా.. నార్నె ఎస్టేట్స్ దాన్ని అమ్మడానికి ప్రయత్నించిందన్నారు. కోర్టులో కేసు నడుస్తుండగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని.. అమ్మకాలు జరపకూడదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఉన్న ఈ 39 ఎకరాల భూమి ఒక్కో ఎకరం 100 కోట్ల రూపాయల కంటే ఎక్కువ పలుకుతోందని చెప్పారు. అక్కడ ప్లాట్లు వేసి, నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నాలు జరిగాయని అధికారులు తెలిపారు. అందుకే వెంటనే చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇలా ఆ బాలుడు క్రికెట్‌పై ఉన్న ఫ్యాషన్‌తో జూబ్లీహిల్స్ ప్రాంతంలో రూ. 3,900 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడటానికి కారణమయ్యాడు.

## చెరువులో తేలియాడిన చేపలు..

జనగాం: జిల్లాలోని బతుకమ్మ కుంటలో నీటిమట్టం అడుగంటి పోయింది. దీంతో వాకింగ్ కోసమని అటుగా వచ్చిన వాకర్స్ చెరువులో పైనే తేలియాడుతున్న చేపలను చూశారు. దీంతో ఒక్కసారిగా చెరువులోకి దిగి వాటిని పట్టుకొని వెళ్లిపోయారు. గతంలో వలలతో పట్టే చేపలు నీళ్లు లేకపోవడంతో.. వారికి సులువుగా దొరికాయి. భూగర్భ జలాలను కాపాడాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.



చేపంటే మహా రుచి.. ఆరోగ్యానికి ఎంతో మంచిది.. అందుకే చాలామంది మేక మాంసం, కోడి కంటే చేపలకే ఓటేస్తారు. పైగా మిగతా నాన్‌వెజ్‌తో పోలిస్తే ఇవి కాస్తంత అందుబాటు ధరల్లో దొరుకుతాయి. కానీ హైదరాబాద్ లాంటి సిటీల్లో బతికున్న చేపలు కనపడటం మహా కష్టం. ఒకవేళ కళ్లెదుట కనిపిస్తే ఇక ఆగగలమా చెప్పండి..? సరిగ్గా అలాంటి సీనే జనగాం జిల్లాలో జరిగింది.

జనగాం జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో ఉదయం పూట వాకింగ్ చేస్తున్న వారికి ఒక అద్భుతం కనపడింది. కుంటలో నీళ్లు బాగా తగ్గిపోవడంతో చేపలన్నీ నీటిపై తేలియాడుతూ కనిపించాయి. చెరువు నిండా చేపలు అలా పైపైనే కనపడితే ఇక జనాలు ఊరుకుంటారా..? ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కుంటలోకి దిగి చేపలు పట్టే పనిలో మునిగిపోయారు. ఎవరికి ఎన్ని దొరికితే అన్ని పట్టుకుని ఇంటికి తీసుకెళ్లారు.

గత కొన్నేళ్లుగా ఈ బతుకమ్మ కుంటలో వలలు వేసి చేపలు పట్టేవారు. కానీ ఈసారి నీళ్లు బాగా తగ్గిపోవడంతో చేపలు పైన తేలుతున్నాయి. అటుగా నడిచి వెళ్లేవాళ్లు, స్థానికులు ఎంచక్కా చెరువులోకి దిగి చేపలు పట్టుకుంటున్నారు. ఇంతకుముందెన్నడూ ఈ బతుకమ్మ కుంట ఇలా నీళ్లు తగ్గిపోవడం చూడలేదు. ఇది చూస్తుంటే జనగాం జిల్లాలో భూగర్భ జలాలు ఎంతలా తగ్గిపోతున్నాయో అర్థమవుతోంది. నిజానికి చేపలు మనకు ఎన్నో విధాలుగా ఉపయోగపడతాయి. వాటిలో ఉండే పోషకాలు మన ఆరోగ్యానికి చాలా మంచివి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ గుండెకు మేలు చేస్తాయి. మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. అందుకే డాక్టర్లు కూడా వారంలో కనీసం రెండుసార్లైనా చేపలు తినమని సలహా ఇస్తుంటారు. కానీ నీళ్లే లేకపోతే చేపలు ఎలా బతుకుతాయి..? చెరువులు, కుంటలు ఎండిపోతే మత్స్యకారుల పరిస్థితి ఏంటి..? జనగాం జిల్లాలోని బతుకమ్మ కుంట పరిస్థితి అలనే ఉంది. ఒకప్పుడు కళకళలాడిన ఈ కుంట ఇప్పుడు నీళ్లు లేక వెలవెలబోతోంది. ఇది కేవలం ఒక కుంట సమస్య కాదు.. ఇది మన భూగర్భ జలాల పరిస్థితికి ఒక హెచ్చరిక. ప్రభుత్వం చెరువులు, కుంటలను కాపాడడానికి చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉంది. ఉన్న నీటిని కాపాడుకోవాలి.. కొత్త నీటి వనరులను సృష్టించాలి. అప్పుడే మన చేపలు బతుకుతాయి.. మన రైతులు బతుకుతారు, మనందరం బాగుంటాం.

# మళ్లీ హైడ్రా కూల్చివేతలు..

### రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఇండ్లు నేలమట్టం



హైదరాబాద్: హైడ్రా మళ్లీ కూల్చివేతలు చేపట్టింది. తాజాగా వనస్థలిపురంలోని ఇంజాపూర్‌లో ప్రధాన రహదారులను ఆక్రమించి నిర్మిస్తున్న అక్రమ ఇళ్లను జేసీబీల సహాయంతో కూల్చివేశారు. స్థానికులు అడ్డుకున్నా అధికారులు కూల్చివేతలు కొనసాగించారు. దీంతో అక్కడ కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలు మళ్లీ మొదలయ్యాయి. తాజాగా, వనస్థలిపురంలో అక్రమ నిర్మాణాలను తొలగించే కార్యక్రమాన్ని హైడ్రా అధికారులు చేపట్టారు. ఇవాళ ఉదయం వనస్థలిపురంలోని ఇంజాపూర్‌లో జేసీబీల సహాయంతో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను అధికారులు కూల్చివేశారు. పలు కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారులను ఆక్రమించి ఈ నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. దీంతో జేసీబీలతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆయా నిర్మాణాలను నేలమట్టం చేశారు. కూల్చివేతలు జరుగుతున్న సమయంలో స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు వారికి నచ్చజెప్పి కూల్చివేతలు కొనసాగించారు.

కాగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జలవనరులను, ప్రభుత్వ భూములను పరిరక్షించడానికి హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేశారు. నగరంలోని చెరువులను ఆక్రమణల నుండి కాపాడటం, వాటి సహజ స్థితిని పునరుద్ధరించడం, ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను తొలగించటం ప్రధాన లక్ష్యం. కాగా, గతేడాది సినీ హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో హైడ్రా పేరు మార్మోగింది. మాదాపూర్‌లోని తమ్మిడి కుంట చెరువు పరధిలో ఎన్ కన్వెన్షన్ నిర్మించారని కూల్చివేశారు. ఆ తర్వాత కూకట్‌పల్లి నల్ల చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన అనేక వాణిజ్య సముదాయాలను నేలమట్టం చేశారు.

**ఆ నిర్మాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ కూల్చం: హైడ్రా కమిషనర్**

ఈ కూల్చివేతలు కొన్నిసార్లు వివాదాస్పదంగా మారాయి. తమకు నోటీసు కూడా ఇవ్వకుండా, ఇండ్లు ఖాళీ చేయకుండా కూల్చివేతలు చేపట్టారని కొందరు నిర్వాసితులు ఆరోపించారు. కొందరు అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని కూడా విమర్శలు వచ్చాయి. హైడ్రా చేపడుతున్న కూల్చివేతలపై పలు సందర్భాల్లో తెలంగాణ హైకోర్టు సీరియస్‌గా స్పందించింది. సెలవు రోజుల్లో కూల్చివేతలు చేపట్టడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వారాంతాల్లో, ఇతర సెలవు దినాల్లో కూల్చివేతలు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించింది.

ప్రాపర్టీ యజమానులకు సరైన నోటీసులు జారీ చేయకుండా, వారి వివరణ తీసుకోవడానికి తగినంత సమయం ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. 'మేము ఎన్నిసార్లు చెప్పాలి? మీరు ఎందుకు వినడం లేదు?' అంటూ హైడ్రా అధికారులను మందలించింది. కొన్ని సందర్భాల్లో కోర్టు స్టే ఆర్డర్‌లు ఇచ్చినప్పటికీ కూల్చివేతలు కొనసాగించడంపై హైకోర్టు సీరియస్‌గా స్పందించింది. చట్టాన్ని ధిక్కరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. చట్టపరమైన ప్రక్రియలను పాటించకపోతే హైడ్రాను మూసివేయడానికి కూడా వెనుకాడబోమని కోర్టు హెచ్చరించింది.

# చిన్నారి మాటలకు.. కన్నీరు పెట్టుకున్న తన్నీరు హరీశ్‌రావు..

సిద్దిపేట: సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని తన తండ్రి గురించి చెబుతూ బాధపడుతుంటే హరీశ్ రావు కన్నీరు పెట్టుకున్నారు. ఆమెను ఓదార్చి ధైర్యం చెప్పారు గతంలో రైతుల ఆవేదన గురించి చెబుతూ ఆయన కంటతడి పెట్టారు. తాజాగా మరోసారి వేదికపై ఓ చిన్నారి ఆవేదనను చూసి ఆ కళ్లు చెమ్మగిల్లాయి.. హరీశ్ రావు ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే నాయకుడు. ఆయన ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తారు. ఈ ఘటన హరీశ్ రావులోని మానవత్వాన్ని, ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమను తెలియజేస్తుంది.

రాజకీయాల్లో రాటుదేలిన నాయకుడు హరీశ్ రావు. పార్టీకి కష్టమొస్తే ట్రబుల్ షూటర్‌లా ముందుండి నడిచే ధీశాలి. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకులను తన మాటలతో ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించే హరీశ్ రావు.. సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో చిన్న పిల్లాడిలా కన్నీరు పెట్టుకున్నారు. అవును.. మీరు విన్నది నిజమే.

సిద్దిపేటలో 'విద్యార్థులు భద్రంగా ఉండాలి – భవిష్యత్తులో ఎదగాలి' అనే అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్ రావు.. విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు.



ఈ సందర్భంగా ఒక విద్యార్థిని హరీశ్ రావుతో మాట్లాడుతూ.. తన తండ్రి చిన్నప్పుడే చనిపోయాడని.. తన తల్లి కష్టపడి చదివిస్తుందని.. తనకు నాన్న ప్రేమ అంటే ఏమిటో తెలియదని బోరున విలపించింది. తనను ఆ మాటలు విన్న హరీశ్ రావు.. ఆ విద్యార్థినిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని చిన్న పిల్లాడిలా కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం ఆ విద్యార్థినిని వేదికపై తన పక్కనే కూర్చోబెట్టుకుని ఓదార్చారు. కార్యక్రమానికి హాజరైన వారంతా ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు.

మా నాన్న చనిపోయాడు.. వేదికపై బాలిక కన్నీరు.. ఆమెను చూసి హరీశ్‌రావు కంటతడి..

హరీశ్ రావు ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే నాయకుడు. ఆయన ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తారు. ఎదుటి వ్యక్తి బాధలో ఉంటే ఆయన మనసు ద్రవిస్తుంది. గతంలో రైతుల ఆవేదన గురించి చెబుతూ ఆయన కంటతడి పెట్టారు. తాజాగా మరోసారి వేదికపై ఓ చిన్నారి ఆవేదనను చూసి ఆ కళ్లు చెమ్మగిల్లాయి. ఎన్నోసార్లు ప్రజల కష్టాల్లో పాలుపంచుకుని వారికి అండగా నిలిచారు. వరదలు వచ్చినప్పుడు.. కరువు కాటకాలు సంభవించినప్పుడు.. ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు ఆయన స్వయంగా రంగంలోకి దిగి వారికి సహాయం చేశారు. ఆయన ప్రజల పట్ల చూపించే కరుణ, ప్రేమ ఆయనను ఒక గొప్ప నాయకుడిగా నిలబెట్టాయి.

హరీశ్ రావు కేవలం రాజకీయ నాయకుడే కాదు, ఆయన ఒక మానవతావాది కూడా. ఆయన ప్రజల కష్టాలను చూసి చలించిపోతారు. వారి బాధలను పంచుకుంటారు. సిద్దిపేటలో జరిగిన ఈ సంఘటన ఆయనలోని మానవత్వాన్ని మరోసారి చాటి చెప్పింది. ఈ ఘటన హరీశ్ రావులోని మానవత్వాన్ని, ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమను తెలియజేస్తుంది. ఆయన కేవలం రాజకీయ నాయకుడే కాదు.. ఒక మంచి మనిషి కూడా అని నిరూపితమైంది.

## కొందర్ని మాత్రమే టార్గెట్ చేస్తున్నారా..?

హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వివా దంలో ఐఏఎస్ స్మితా సబర్వాల్‌కు నోటీసులు అందిన సంగతి తెలిసిందే. ఏఐ ఫొటోను రీట్వీట్ చేయడంపై పోలీసులు ఆమెకు నోటీసులు ఇచ్చారు. తాజాగా పోలీసుల నోటీసులకు వివరణ ఇచ్చినట్లు స్మితా వెల్లడించారు. అయితే, తనలాగే చాలామంది పోస్టును రీట్వీట్ చేశారని.. వారందరికీ నోటీసులు ఇచ్చారా? అని స్మితా ప్రశ్నించారు.

హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూముల వివాదంలో సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్‌కు పోలీసులు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. అక్కడ జంతువులు ఉన్నాయంటూ ఏఐ ఫొటోతో ప్రచారం జరిగింది. 'హాయ్ హైదారాబాద్' అనే ట్విట్టర్ యూజర్ ఓ ఏఐ ఫొటోను ట్వీట్ చేయగా.. స్మితా సబర్వాల్ దాన్ని రీట్వీట్ చేశారు. దీనిపై పోలీసులు ఆమెకు నోటీసులు పంపారు. మొదట స్పందించకపోయినా.. తర్వాత ఆమె ప్రభుత్వానికి వ్యతిరేకంగా ట్వీట్లు చేశారు. తాజాగా ఆమె ఈ వివాదంపై స్పందిస్తూ.. నోటీసులకు సమాధానం ఇచ్చానని తెలిపారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా, పోలీసులు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చానని ఆమె పేర్కొన్నారు.

స్మితా సబర్వాల్ తన రీట్వీట్‌పై వివరణ ఇస్తూ.. తనలాగే మరో 2 వేల



మంది కూడా ఆ ట్వీట్‌ను రీట్వీట్ చేశారని గుర్తు చేశారు. 'నాకు పంపినట్లే మిగతా 2 వేలమందికి కూడా నోటీసులు పంపించారా..? వారందరిపైనా ఇలాంటి చర్యలే తీసుకున్నారా?' అని ఆమె ప్రశ్నించారు. చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందా..? లేక కొందరినే ఎంపిక చేసి టార్గెట్ చేస్తున్నారా..? అని ఆమె పోలీసులను నిలదీశారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఫేక్ ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు తీసుకుంటోంది. మార్ఫింగ్ చేసిన ఫోటోలను పోస్ట్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో చాలామంది నాయకులు తాము చేసిన పోస్టులను తొలగించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా తన ట్వీట్‌ను తొలగించారు. అయితే, స్మితా సబర్వాల్ మాత్రం వెనక్కి తగ్గకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరిన్ని పోస్టులు చేస్తున్నారు. పోలీసుల నోటీసులు అందుకున్నా ఆమె తన దూకుడును తగ్గించలేదు. సుప్రీంకోర్టు తీర్పులకు సంబంధించిన వార్తలను వరుసగా ట్వీట్ చేశారు. వాటిల్లో 100 ఎకరాలను పునరుద్ధరించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్న ఫోటో కూడా ఉంది.

ఆమె ప్రభుత్వానికి వ్యతిరే కంగా ట్వీట్లు చేయడం, పోలీసుల నోటీసులకు సమాధానం ఇవ్వడం వంటి విషయాలు హాట్ టాఫిక్‌గా మారాయి. ఈ వివాదం ముందు ముందు ఎలాంటి మలుపులు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చాలా ఈజీ..

హైదరాబాద్: డ్రైవింగ్ లైసెన్స్ గడువు ముగిసిన వారు ఇకపై ఆన్‌లైన్‌లోనే రెన్యూవల్ చేసుకోవచ్చు. రవాణా శాఖ వెబ్‌సైట్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని, ఫీజు చెల్లించ్‌వచ్చు. వైద్య ధ్రువీకరణ పత్రం పొంది, ఆధార్, ఒరిజినల్ లైసెన్స్‌తో ఆర్టీఏ కార్యాలయానికి వెళితే సరిపోతుంది. ఈ విధానంతో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఇంట్లోనే సులభంగా లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవచ్చు.



వాహనాలు నడపాలంటే కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాల్సిందే. అయితే కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నప్పుడు వయసు ఆధారంగా కొన్నేళ్ల గడువుతో రవాణాశాఖ అధికారులు లెసెన్సులు జారీ చేస్తారు. ఈ గడువు ముగిసేలోగా డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. గడువు ముగిసిన 30 రోజుల్లో (గ్రేస్ పీరియడ్) రెన్యువల్ చేసుకోకుంటే ఫైన్ చెల్లించాల్సిందే. గడువు ముగిసి చాలా రోజులైతే ఫైన్‌తో పాటు మళ్లీ కొత్త డ్రైవింగ్ లైసెన్సు కోసం అప్లయ్ చేసుకోవాలి. ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి కొత్త లైసెన్స్ మాదిరిగా మళ్లీ డ్రైవింగ్ టెస్ట్ ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ఇక ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి రెన్యూవల్ చేసుకోవటం ఇబ్బందికరమైన పని. రెన్యూవల్ కోసం అవసరమైన అన్ని పత్రాలను సేకరించటం, సరైన ఫార్మాట్‌లో సమర్పించడం, కార్యాలయంలో వేచి ఉండటం వంటి వాటికి సమయం కేటాయించాల్సి వస్తుంది. కొందరు మధ్యవర్తులను ఆశ్రయించడం వల్ల అదనపు ఖర్చు భరించాల్సి వస్తుంది. మోసపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఇవేవి లేకుండా ఇంట్లోనే డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్ చేసుకోవచ్చుననే విషయం తెలుసా..? స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

**ఈ స్టెప్స్ ఫాలో అవ్వండి**

లైసెన్స్ రెన్యూవల్ చేయించుకునేవారు మొదట రవాణా శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి.

డ్రైవింగ్ లైసెన్స్ సంబంధిత సేవల విభాగంలో 'డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్' ఎంపికపై క్లిక్ చేయండి.

పేజీ లోడ్ అయిన తర్వాత, 'స్లాట్ బుకింగ్ కంటిన్యూ' పై క్లిక్ చేయండి.

తరువాత 'రెన్యూవల్ ఆఫ్ లైసెన్స్' ను ఎంచుకుని 'గో' పై క్లిక్ చేయండి.

మీ డ్రైవింగ్ లైసెన్స్ నెంబర్, లైసెన్స్ జారీ చేసిన ఆర్టీఏ కార్యాలయం, పుట్టిన తేదీ, మొబైల్ నెంబర్, క్యాప్చా కోడ్‌ను నమోదు చేయండి.

'రిక్వెస్ట్ ఓటీపీ' పై క్లిక్ చేయండి. మీ మొబైల్ నెంబర్‌కు ఒక వన్-టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది.

ఎంటర్ చేసి 'గెట్ డీటెయిల్స్' పై క్లిక్ చేయండి. మీ వ్యక్తిగత వివరాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి.

మీ వివరాలను సరిచూసుకున్న తర్వాత 'కన్ఫర్మ్' పై క్లిక్ చేసి, 'సేవ్' బటన్‌ను నొక్కండి. మీ వివరాలు భద్రపరచబడతాయి.

కొత్త విండోలో, మీకు అనుకూలమైన తేదీ మరియు సమయాన్ని స్లాట్ కోసం ఎంచుకుని 'నెక్స్ట్' పై క్లిక్ చేయండి.

మీరు చెల్లించాల్సిన రుసుము మొత్తాన్ని పరిశీలించి 'పే నౌ' పై క్లిక్ చేయండి.

అందుబాటులో ఉన్న పేమెంట్ ఆప్షన్లలో మీకు నచ్చిన పద్ధతిని ఎంచుకుని రుసుము చెల్లించండి. స్లాట్ బుక్ అవుతుంది. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జనరేట్ అవుతుంది.

మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌ను ప్రింట్ తీసుకోండి.

వైద్యునితో మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌పై సంతకం చేయించండి.

స్లాట్ బుక్ చేసుకున్న తేదీన మీ ఆధార్ కార్డ్, ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లండి.

అక్కడ మీ పత్రాలను సమర్పించిన తర్వాత, కొన్ని రోజుల్లో మీ రెన్యూవల్ అయిన డ్రైవింగ్ లైసెన్స్ మీకు వస్తుంది.

## 28 ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ రద్దు..

తెలంగాణ: రాష్ట్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ప్రైవేట్ ఆసుపత్రులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. గత ప్రభుత్వ హయాంలో వెలుగు చూసిన ఈ కుంభ కోణంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటూ.. రాష్ట్రవ్యాప్తంగా 28 ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లను రద్దు చేసింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ – 2010 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం, తక్షణమే దీనిని అమలు చేయాలని సంబంధిత జిల్లాల వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించింది. ఈ చర్యతో వైద్య రంగంలో అవినీతికి పాల్పడే వారికి ఒక బలమైన సందేశం వెళ్లినట్లయింది. ఇటీవల జీహెచ్ఎంసీ పరిధిలోని కొన్ని ఆసుపత్రులు ఆస్తి పన్నులు చెల్లించడంలో నిర్లక్ష్యం వహించగా.. వాటిని సీజ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ రద్దు చేసిన వాటిలో.. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 10 ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 6, హైదరాబాద్‌లో 4, నల్గొండలో 3, మహబూబాబాద్‌లో 2, కరీంనగర్, పెద్దపల్లి, హనుమకొండ జిల్లాల్లో ఒక్కో ప్రైవేట్ ఆసుపత్రి లైసెన్స్ రద్దు చేయబడింది. రోగులకు వైద్యం అందించకుండానే నకిలీ బిల్లులు సృష్టించి.. నిధులను కొల్లగొట్టినట్లు ఈ ఆసుపత్రులపై ఆరోపణలు ఉన్నాయి. ఇది పేద, నిరుపేద రోగుల కోసం ఉద్దేశించిన నిధులను సొంత లాభాల కోసం వాడుకోవడం అత్యంత హేయమైన చర్య.

కుంభకోణంపై రేవంత్ సర్కార్ సీరియస్‌గా దృష్టి సారించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే లోతుగా దర్యాప్తు చేయించింది. గత ఏడాది ఈ కేసును సీఐడీకి అప్పగించి.. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించింది. ఈ విచారణలో ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాల పాత్ర ఉందని తేలడంతో.. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా.. ఆయా ఆసుపత్రులను వైద్యారోగ్య శాఖ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. ఇప్పుడు ఏకంగా వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేయడం ద్వారా ప్రభుత్వం తన నిబద్ధతను చాటు కుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య ప్రజల నుండి విశేషమైన మద్దతు పొందుతోంది. పేద ప్రజల కోసం ఉద్దేశించిన నిధులను కొల్లగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరు కుంటున్నారు. ఈ నిర్ణయం ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు కూడా ఒక హెచ్చరికగా నిలుస్తుంది. ఇకపై ఎవరైనా ఇలాంటి అక్రమాలకు పాల్పడితే వారిపై కూడా కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆరోగ్య రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## ఓ హీరోని ఊహించుకుని కథ

# వేరే హీరోతో సినిమా



ఓ హీరోని ఊహించుకుని కథ రాసుకోవడం... కొన్ని అనివార్య కారణాలతో వేరే హీరోతో సినిమా తీయడం ఇండస్ట్రీలో తరుచూ జరిగే తంతే. అయితే అలా వచ్చిన సినిమాలు కొన్ని ఘనవిజయం సాధిస్తే.. మరికొన్ని ఫ్లాఫ్ అవుతుంటాయి. సినీ ఇండస్ట్రీలో శేఖర్ కమ్ముల గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. రాజా, శేఖర్ కమ్ముల కాంబినేషన్లో వచ్చిన 'ఆనంద్' మూవీ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. మంచి కాఫీలాంటి సినిమా అంటూ విమర్శకుల చేతకూడా ప్రశంసలు అందుకుంది. అయితే శేఖర్ కమ్ములు ముందుగా ఈ కథను మరో హీరోని ఊహించుకుని రాసుకున్నారట. ఆయనెవరో కాదు పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్. అవును ఈ విషయాన్ని గతంలో ఆయన ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

1972, ఫిబ్రవరి 4న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో జన్మించిన శేఖర్ కమ్ముల.. పాఠశాల విద్య, ఇంటర్, బీటెక్ అన్నీ హైదరాబాద్‌లోనే పూర్తిచేసి ఉన్నత చదువుల కోసమని అమెరికా వెళ్లారు. అక్కడ కంప్యూటర్ సైన్స్‌లో పీజీ చేసి అనంతరం వాషింగ్టన్‌లోని హెూవార్డ్ యూనివర్శిటీలో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో చేరాడు. చదువు పూర్తయ్యాక అక్కడే కొంతకాలం ఉద్యోగం చేసిన ఆయన సినిమాలపై ఆసక్తిగా ఉద్యోగానికి రాజీనామా చేసి ఫిల్మ్ మేకింగ్ కోర్సులో చేరారు. ట్రైనింగ్‌లో ఉండగానే తాను రాసుకున్న స్క్రిప్టుతో 'డాలర్ డ్రీమ్స్' అనే పేరుతో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ఓ చిత్రాన్ని తీశారు. అది కమర్షియల్‌గా సక్సెస్ కాకపోయినా 'బెస్ట్ డెబ్యూ డైరెక్టర్'గా ఆయనకు జాతీయ అవార్డు తెచ్చిపెట్టింది.

అయితే ఎలాగైనా కమర్షియల్ హిట్ కొట్టాలన్న కసితో ఆయన 'ఆనంద్' స్టోరీని రాసుకున్నారు. ఆ కథను పవన్ కళ్యాణ్‌ని దృష్టిలో పెట్టుకుని రాసుకున్నానని.. కానీ ఆయన్ని ఎప్పుడూ కలవలేదని శేఖర్ కమ్ముల గతంలో చెప్పారు. అయితే పవన్‌ని ఎందుకు మీట్ కాలేదన్న విషయాన్ని మాత్రం చెప్పలేదు. చివరికి ఆ కథ అప్పటికి మూడు సినిమాల అనుభవం మాత్రమే ఉన్న రాజా చేతికి వెళ్లింది. ఇక హీరోయిన్‌గా అసిన్, సదాలను అనుకున్నా చివరికి కొత్త హీరోయిన్ కమలినీ ముఖర్జీకి ఛాన్స్ దక్కింది. ఇక 'ఆనంద్' మూవీ చేసిన మ్యాజిక్.. క్రియేట్ చేసిన రికార్డుల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అటు రాజాకి, ఇటు కమలినీకి మంచి పేరు తీసుకొచ్చింది.

'ఆనంద్' మూవీ రిలీజ్ విషయంలో కొంత రభస జరిగింది. మెగాస్టార్ చిరంజీవి నటించిన 'శంకర్‌దాదా ఎంబీబీఎస్' విడుదల తేదీనే 'ఆనంద్' టీమ్ కూడా ప్రకటించడం అప్పట్లో ఇండస్ట్రీలో హాట్‌టాపిక్‌గా మారింది. చిరంజీవితో పెట్టుకుని శేఖర్ కమ్ముల రిస్క్ చేస్తున్నాడని చాలామంది మాట్లాడుకున్నారు. చివరికి రెండు సినిమాలు 2004, అక్టోబర్ 15న రిలీజై మంచి విజయాలను దక్కించుకున్నాయి. అయితే పవన్‌తో 'ఆనంద్' మూవీ మిస్ అయిన శేఖర్ కమ్ముల ఆయనతో 'లీడర్ 2' తీసేందుకు ట్రై చేస్తున్నాడని కొంతకాలం ప్రచారం జరిగినా ఆ దిశగా ప్రయత్నాలు ముందుకెళ్లలేదు.





# చైతూ పక్కన మీనాక్షి..

మైథలాజికల్ థ్రిల్లర్‌గా నిర్మిస్తోన్న ఈ మూవీలో చైతూ స్టైల్, లుక్, క్యారెక్టర్ అన్నీ ఔట్ ఆఫ్ ది బాక్స్ గా ఉండనున్నాయంటూ ప్రచారం జరుగుతోంది. కొన్ని నెలల క్రితమే ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించారు. . నాగచైతన్య 24వ సినిమాగా తెరకెక్కుతోన్న ఈ మూవీకి ఓ డిఫరెంట్ టైటిల్ ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. ఇంతకీ పేరేంటో తెలుసా.. 'వృషకర్మ'. ఇతర చిత్రాలతో పోలిస్తే ఇందులో చైతూ పాత్రకు చాలా డెప్త్ ఉంటుందట.

'విరూపాక్ష' సినిమాతో సూపర్ హిట్ కొట్టిన కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా ఓ థ్రిల్లర్ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. కొన్ని నెలల క్రితమే ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభించారు. వెండితెరపై ప్రేక్షకులకు సరికొత్త ప్రపంచాన్ని చూపించేందుకు రెడీ అవ్వండి అంటూ సినిమా ఎలా ఉంటుందో ముందుగానే హింట్ ఇచ్చేశారు మేకర్స్. ఈమధ్య కాలంలో రెగ్యులర్ కమర్షియల్ కథలను పక్కన పెట్టి డిఫరెంట్ కంటెంట్ ను సెలెక్ట్ చేసుకుంటున్న నాగచైతన్య 'తండేల్'తో తన కెరీర్లోనే బిగ్గెస్ట్ హిట్ కొట్టడంతో పాటు రూ.100 కోట్ల క్లబ్‌లోనూ చేరాడు. ఇక'విరూపాక్ష'తో తనేంటో నిరూపించుకున్న కార్తీక్ దండుతో సినిమా చేస్తున్నాడనగానే అందరి ఫోకస్ ఒక్కసారిగా ఈ ప్రాజెక్ట్‌పై పడింది. నాగచైతన్య 24వ సినిమాగా తెరకెక్కుతోన్న ఈ మూవీకి ఓ డిఫరెంట్ టైటిల్ ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. ఇంతకీ పేరేంటో తెలుసా.. 'వృషకర్మ'

మైథలాజికల్ థ్రిల్లర్‌గా నిర్మిస్తోన్న ఈ మూవీలో చైతూ స్టైల్, లుక్, క్యారెక్టర్ అన్నీ ఔట్ ఆఫ్ ది బాక్స్ గా ఉండనున్నాయంటూ ప్రచారం జరుగుతోంది. విరూపాక్ష లాంటి మిస్టరీ థ్రిల్లర్‌తో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన కార్తీక్ దండు డైరెక్టర్ కావడం, సీనియర్ నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాతగా వ్యవహరిస్తుండటంతో ఈ ప్రాజెక్టులపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ మూవీకి సుకుమార్ రైటింగ్స్ ప్రెజెంటేషన్ ఇవ్వడం, ప్రీ-ప్రొడక్షన్ దశలో నుంచే హై వాల్యూస్ చూపించడం చూస్తే, కంటెంట్ పరంగా చాలా కొత్తగా ఉండనున్నట్లు అర్థమవుతుంది.

'తండేల్' సినిమాలో మత్స్యకారుడిగా కండలు తిరిగిన రఫ్ లుక్‌లో కనిపించిన చైతూ ఈ సినిమా కోసం పూర్తిగా మేకోవర్ అవుతున్నాడు. ఇతర చిత్రాలతో పోలిస్తే ఇందులో చైతూ పాత్రకు చాలా డెప్త్ ఉంటుందట. కథలో కొన్ని రహస్యాలు, అనూహ్య మలుపులతో ఈ సినిమా పీక్ థ్రిల్లర్‌గా తయారవుతోందట. కార్తీక్ దండు టేకింగ్ ఎలా ఉంటుందో ప్రేక్షకులు 'విరూపాక్ష'లో చూశారు. ఆ సినిమాలో చివర్లో వచ్చే ట్విస్ట్ అయితే మైండ్ బ్లోయింది. చైతూ మూవీలో అంతకుమించి ట్విస్టులు ఉంటాయట. ఈ మూవీ షూటింగ్ ఎక్కువ భాగం అడవుల్లోనే జరగనున్నట్లు తెలుస్తోంది.

ఈ సినిమాలో నాగచైతన్యకి జోడిగా మీనాక్షి చౌదరి నటిస్తున్నట్లు సమాచారం. ముందుగా పూజా హెగ్డేని తీసుకోవాలనుకున్నప్పటికీ.. ఆమె కెరీర్ ప్రస్తుతం డౌన్‌లో ఉండటం, ఆల్రెడీ చైతూతో ఓ సినిమాలో నటించడంతో ఫ్రెష్ లుక్ కోసం చూశారట. చివరికి ట్రెండీ హీరోయిన్‌గా ఉన్న మీనాక్షి చౌదరిని కన్ఫామ్ చేసినట్లు వార్తలొస్తున్నాయి. లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం. వంటి బ్లాక్‌బస్టర్లతో మీనాక్షి రేంజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. ఆ క్రేజ్‌తోనే చైతు పక్కన ఛాన్స్ కొట్టేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై మేకర్స్ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.



# దేవా కట్టా భారీ ప్లానింగ్

1

విప్లవాత్మక దర్శకుడు దేవా కట్టా భావాజాలం ఎంత గొప్పగా ఉంటుందో అందరికీ తెలిసిందే. దేవా కట్టా అభిరుచి, మార్క్, మేకింగ్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్ మీద చెరగని ముద్ర వేశాయి. ప్రస్థానం మూవీ అందరికీ ఆల్ టైం ఫేవరేట్‌గా ఉంటుంది. చివరగా తేజ్ హీరోగా రిపబ్లిక్ అనే మూవీని దేవా కట్టా తెరకెక్కించి విమర్శకుల ప్రశంసలను అందుకున్నాడు. ఇక ఇప్పుడు మయసభ అంటూ రాబోతోన్నాడు. దేవా కట్టా తీసిన ప్రస్థానం, రిపబ్లిక్ చిత్రాలకు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. ప్రస్థానం సినిమాతో శర్వానంద్, సాయి కుమార్ పాత్రలకు మంచి పేరు వచ్చింది. రిపబ్లిక్ చిత్రం కమర్షియల్‌గా ఆడకపోయినా.. ఓ కనువిప్పు కలిగించే చిత్రంగా నిలిచింది. అలా సమాజాన్ని ప్రశ్నించే చిత్రాలు తీయడంలో దేవా కట్టా శైలి ప్రత్యేకంగా ఉంటుంది. ఆయన ఇప్పుడు మయసభ అంటూ వెబ్ సిరీస్‌ను తీసే పనిలో పడ్డాడు. ఇంత వరకు తన ప్రాజెక్టుల్ని ప్రకటించకపోవడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆయన్ను అడిగినట్టుగా ఉన్నారు. ఇక దేవా కట్టా తన ప్రాజెక్టుల గురించి ఓ ట్వీట్ వేశాడు. ప్రస్తుతం మయసభ మొదటి సీజన్ పనుల్లో ఉన్నానని చెప్పుకొచ్చాడు. ఇప్పటికే 400 నిమిషాల ఫుటేజ్ సిద్ధమైందని అంటున్నాడు. అంటే దగ్గరదగ్గరగా మొదటి సీజన్ ఏడు గంటల నిడివి ఉంటుందని అర్థం అవుతోంది. వెబ్ సిరీస్ కాబట్టి దీనికి ఓ లిమిట్ గానీ, నిడివి ఇంత ఉండాలనే సమస్య గానీ ఉండదు. ఎంగేజింగ్‌గా ఉంటే పది గంటలు లేవకుండా అయినా కూర్చుని చూస్తారు ఆడియెన్స్. ఈ వెబ్ సిరీస్ మాత్రమే కాకుండా ఇంకో సినిమాకు స్క్రిప్ట్ కూడా రెడీ చేస్తున్నాడట. తనకు ఇష్టమైన యాక్టర్, స్టార్‌తో ఆ సినిమా ఉంటుందని హింట్ ఇచ్చాడు. కానీ ఆ స్టార్ హీరో, యాక్టర్ ఎవరు అన్నది మాత్రం రివీల్ చేయలేదు. చూస్తుంటే మళ్లీ సాయి ధరమ్ తేజ్‌తోనే సినిమా చేస్తాడా? లేదంటే శర్వానంద్ సినిమా తీస్తాడా? అన్నది చూడాలి. దేవా కట్టా బ్రాండ్ ఇమేజ్ అయితే ఇప్పటికీ జనాల్లో ఏ మాత్రం తగ్గలేదన్న సంగతి తెలిసిందే. ఇక ఈ మయసభ సీజన్ వన్ ఎప్పుడు వస్తుందో చూడాలి. ఈ వెబ్ సిరీస్‌లో సాయి కుమార్ ముఖ్య పాత్రను పోషిస్తున్నాడు. సాయి కుమార్ తన సినీ జర్నీ గురించి మాట్లాడుకుంటూ ప్రతీ సారి ఈ మయసభ గురించి చెబుతూనే ఉన్నాడు. ఈ వెబ్ సిరీస్‌లో తన పాత్ర అద్భుతంగా ఉంటుందని చెప్పుకొస్తున్నాడు. అసలే ఈ మధ్య సాయి కుమార్ నటిస్తే చాలు సినిమా బ్లాక్ బస్టర్ అన్నట్టుగా మారిపోయింది. లక్కీ భాస్కర్, సరిపోదా శనివారం, కమిటీ కుర్రోళ్లు ఇలా చాలా చిత్రాలు కమర్షియల్‌గా హిట్ల మీద హిట్లు అవుతున్నాయి. ప్రస్థానం రేంజ్‌లో ఈ మయసభ వెబ్ సిరీస్ సాయి కుమార్‌కు పేరు తెచ్చి పెడుతుందా? లేదా? అన్నది త్వరలోనే తెలుస్తుంది. ఈ ఏడాదిలోనే ఈ వెబ్ సిరీస్ ఆడియెన్స్ ముందుకు రానుందని సమాచారం.

## ఫేవరేట్ కారుని కొన్న

# ఏఆర్ రెహమాన్..




స్వర మాంత్రికుడు ఏఆర్ రెహమాన్ ప్రస్తుతం కొత్త కారుని కొన్నాడు. మహేంద్ర కంపెనీకి చెందిన కొత్త ఎలక్రికల్ వెహికల్ తనకు ఎంతో ఇష్టమని చెప్పుకొచ్చాడు. అందుకే ఈ కొత్త మోడల్ కారుని కొన్నానని అంటున్నాడు. ఈ కొత్త మోడల్ %ఖ్షిప్తఱఅనత్ఝ ఇవజ 9వ% కారు అంటే రెహమాన్‌కి ఎంత ఇష్టమో ఫోటోలను చూస్తేనే అర్థం అవుతోంది. ఇక ఈ కొత్త కారుకి ఏఆర్ఆర్ అనే నంబర్ ప్లేటుని అమర్చుకున్నాడు. కానీ ఇది నిబంధనలకు విరుద్దం అన్న సంగతి తెలిసిందే. అయితే ఈ కొత్త మోడల్ ధర మాత్రం గరిష్టం ముప్పై నుంచి నలభై లక్షల వరకు చూపిస్తోంది. రెహమాన్ తల్చుకుంటే కోట్లు పెట్టి కార్లు కొనగలడు. కానీ తనకు నచ్చిన ఈ ఫేవరేట్ కారుని మాత్రమే రెహమాన్ సొంతం చేసుకున్నాడు. ఇక రెహమాన్ ప్రస్తుతం థగ్ లైఫ్ ఫస్ట్ సింగిల్ లాంచ్ ఈవెంట్లో బిజీగా ఉన్నాడు. మణిరత్నం, కమల్ హాసన్ క్రేజీ కాంబోలో చాలా ఏళ్ల తరువాత థగ్ లైఫ్ అనే ఓ చిత్రం రాబోతోంది. థగ్ లైఫ్ ఫస్ట్ సింగిల్ లాంచ్ ఈవెంట్ చెన్నైలో గ్రాండ్‌గా జరిగింది. ఈ వేడుకలో రెహమాన్, మణిరత్నం, కమల్ హాసన్ ఇలా టీం అంతా సందడి చేసింది. ఇక ఇదే క్రమంలో రెహమాన్ తన కొత్తు కారు గురించి సోషల్ మీడియాలో పోస్ట్ వేశాడు. ప్రస్తుతం రెహమాన్ కొత్త కారు, దాని నంబర్ ప్లేటు మాత్రం ఎక్కువగా వైరల్ అవుతోంది. నంబర్ ప్లేట్ మీద నంబర్ కాకుండా ఇలా ఏఆర్ఆర్ అని ఉంది. ఇదే ప్లేట్‌తో బయటకు వస్తే రెహమాన్‌కు ఫైన్ పడుతుందేమో మరి.

ప్రస్తుతం రామ్ చరణ్ పెద్ది సినిమా కోసం రెహమాన్ పని చేస్తున్నాడు. పెద్ది ఫస్ట్ షాట్ కోసం రెహమాన్ కొట్టిన బీజీఎం అందరినీ మెప్పించింది. చాలా రోజుల తరువాత మళ్లీ రెహమాన్ బీజీఎం సత్తా ఏంటో అందరికీ తెలిసి వచ్చింది. ఆల్రెడీ షూటింగ్ స్టార్ట్ కాక ముందే రెహమాన్ నుంచి మూడు పాటల్ని బుచ్చిబాబు రాబట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ పెద్ది ఆల్బమ్‌తో మరోసారి రెహమాన్ దేశ వ్యాప్తంగా ట్రెండ్ క్రియేట్ చేయబోతోన్నాడని సమాచారం. ఇంత వరకు రెహమాన్ సంగీతం మీద, బీజీఎం మీద చాలా మందికి అనుమానాలు ఉండేవి. కానీ పెద్ది ఫస్ట్ షాట్‌తో ఒక్కసారిగా అనుమానాలన్నీ పటా పంచలయ్యాయ్. ఈ పెద్ది చిత్రం వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది.

## హరి హర వీరమల్లు

# ఫ్యాన్స్ ఆవేదన



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న హిస్టారికల్ అడ్వెంచర్ యాక్షన్ డ్రామా 'హరి హర వీరమల్లు'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో సెట్స్ మీదకు వెళ్లిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని ప్రస్తుతం ఏఎం జ్యోతి కృష్ణ తెరకెక్కిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ లో ఏఎం రత్నం భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇప్పటికే అనేక విడుదల తేదీలను మార్చుకున్న ఈ చిత్రం.. మరోసారి వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయని సోషల్ మీడియాలో రూమర్స్ చక్కర్లు కొడుతున్నాయి.

పవన్ కళ్యాణ్ అభిమానులు ఆసక్తిగా వేచి చూస్తున్న సినిమా 'హరి హర వీరమల్లు'. సోషల్ మీడియాలో గత కొన్ని రోజులుగా ఈ మూవీ గురించే చర్చలు జరుగుతున్నాయి. ఎప్పుడు రిలీజ్ అవుతుంది? షూటింగ్ ఎప్పుడు కంప్లీట్ అవుతుంది? పవన్ తిరిగి ఎప్పుడు సెట్స్ లో అడుగు పెడతారు? ప్రీ ప్రొడక్షన్ ఎక్కడి వరకూ వచ్చింది? అసలు చెప్పిన సమయానికి విడుదల అవుతుందా లేదా?.. ఇలా అనేక విషయాల మీద డిస్కషన్స్ జరుగుతున్నాయి.

క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ హీరోగా 27' అనే వర్కింగ్ టైటిల్ తో 2020 జనవరిలో ఈ చిత్రాన్ని ప్రకటించారు. కొంత కాలానికి 'హరి హర వీరమల్లు' అనే టైటిల్ ను ఫిక్స్ చేశారు. అయితే అనౌన్స్ మెంట్ వచ్చి ఐదేళ్లు దాటినా ఇంతవరకూ సినిమా విడుదల కాలేదు. కారణాలు ఏవైనా ఏళ్ల తరబడి నిర్మాణం జరుపుకుంటూనే ఉంది. ఈ గ్యాప్ లో డైరెక్టర్ క్రిష్ 'కొండపొలం' అనే మరో సినిమా పూర్తి చేసి రిలీజ్ చేశారు. వీరమల్లు నుంచి బయటకు వచ్చి 'ఘాటీ' అనే ఇంకో మూవీని విడుదలకు సిద్ధం చేశారు.

'హరి హర వీరమల్లు' సినిమా దర్శకత్వ బాధ్యతలను చేపట్టిన ఎఎం జ్యోతి కృష్ణ.. వీలైనంత త్వరగా ఈ చిత్రాన్ని పూర్తి చేయడానికి ప్రయత్నాలు చేసారు. అయితే పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయాణం కారణంగా చిత్రీకరణ ఆలస్యమైంది. ఈ క్రమంలో ఎన్నో రిలీజ్ డేట్లు మారాయి. మార్చి 28న గ్రాండ్ గా థియేటర్లలోకి తీసుకొస్తామని చెప్పి, వాయిదా వేసుకున్నారు. చివరగా మే 9న వరల్డ్ వైడ్ గా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని ప్రకటించారు. కానీ ఈసారి కూడా పోస్ట్ పోన్ అయ్యే అవకాశాలు ఉన్నాయని రూమర్స్ వస్తున్నాయి.

'హరి హర వీరమల్లు' పార్ట్-1 సినిమా మే 9న రిలీజ్ చేయటం కుదిరేపని పని కాదనే మాట సినీ వర్గాల్లో వినిపిస్తోంది. పవన్ కళ్యాణ్ పాత్రకు సంబంధించిన షూటింగ్ ఇంకా పెండింగ్ ఉండటం.. ఎప్పుడు కాల్షీట్స్ ఇస్తారో క్లారిటీ లేకపోవడం వల్లనే ఈ పుకార్లు ప్రచారంలోకి వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న టాక్ ప్రకారం, మరో ఐదు పది రోజుల్లో పవన్ షూట్ లో పాల్గొనడానికి రెడీ అవుతున్నారట. వీలైనంత త్వరగా చిత్రీకరణ పూర్తి చెయ్యాలని భావిస్తున్నారట. ఈ నేపథ్యంలో మే మూడో వారంలో లేదా నెలాఖరున ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.

ఎలా చూసుకున్నా 'హరి హర వీరమల్లు' సినిమా మే 9న విడుదల కావడం కష్టమే అని తెలుస్తోంది. దీంతో పవన్ కల్యాణ్ అభిమానులు నిరాశ చెందుతున్నారు. వీరమల్లు కంటే ముందు పోలవరం ప్రాజెక్ట్ కంప్లీట్ అవుతుందేమో అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇలా వాయిదాలు వేసుకుంటూ పోతే, అసలు ఇలాంటి సినిమా ఒకటి ఉందనే సంగతి జనాలు మర్చిపోయే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ మేకర్స్ మాత్రం పోస్ట్ ప్రొడక్షన్ శరవేగంగా జరుగుతోందని, వచ్చే నెల 9న ఎట్టిపరిస్థితుల్లోనూ రిలీజ్ చేస్తామని ఇటీవలే ప్రకటించారు.

# బర్త్‌డేకి డబుల్ ట్రీట్



సినిమా హీరోల పుట్టినరోజులంటే వాళ్ల ఫ్యాన్స్‌కి పండగే. ఆ రోజు తమ అభిమాన హీరోకి ఫ్లెక్సీలు కట్టి శుభాకాంక్షలు చెప్పడం, కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ విషెస్ చెప్పడం చూస్తూనే ఉంటాం. తమ హీరో పుట్టినరోజు సందర్భంగా ఆయన నటించే సినిమాలకు సంబంధించి ఏవైనా అప్‌డేట్లు వస్తాయేమోనని ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. ఇక గాడ్ ఆఫ్ మాసెస్‌గా స్థిరపడి పోయిన నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వస్తుం దంటే ఆయన ఫ్యాన్స్‌కి పండగే. ఇటీవల వరుస హిట్లతో దూకుడుమీదున్న ఆయన 'అఖండ 2' లో నటిస్తూ బిజీగా ఉన్నారు. వచ్చే దసరాకు ఈ మూవీని రిలీజ్ చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించడంతో షూటిం గ్ శరవేగంగా జరుగుతోంది. అయితే ఈ సినిమా తర్వాత బాలయ్య నటించే సినిమాలపైనా ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలోనే ఆయన పుట్టినరోజైన జూన్ 10న 'అఖండ 2' అప్‌డేట్‌తో పాటు కొత్త ప్రాజెక్టులపై అనౌన్స్‌మెంట్ వచ్చే అవకాశాలున్నాయని తెలుస్తోంది. టాలీవుడ్‌లో బాలయ్య, బోయపాటి కాంబో గురించి ఎంత చెప్పినా తక్కువే. సింహా, లెజెండ్, అఖండ... చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టిన వీరిద్దరు ఇప్పుడు 'అఖండ 2'తో రానున్నారు. 'అఖండ' బ్లాక్‌బస్టర్ కావడంతో దానికి సీక్వెల్‌గా వచ్చే 'అఖండ 2'పై భారీ అంచనాలున్నాయి. బాలయ్య కెరీర్లోనే తొలి పాన్ ఇండియా మూవీగా తెరకెక్కనున్న 'అఖండ 2' టీజర్‌ని బాలయ్య పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసేందుకు బోయపాటి ప్లాన్ చేస్తున్నాడట. టీజర్ కోసం ప్రత్యేకంగా కొన్ని విజువల్స్ షూటింగ్ చేయగా.. గ్రాఫిక్ వర్క్ కూడా జోరుగా సాగుతోందట.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,